aruhi
aruhi group
MAHAA PRABHA NEWS
Delivering truth with integrity – the voice of the people."
Email : info@mahaaprabha.com
www.mahaaprabha.com - 9160600610
VINTAARA INSTITUTE OF TECHNOLOGY
Build Your Dream Career
ADMISSION OPEN
HYDERABAD & VIJAYAWADA & VISAKHAPATNAM & GUNTUR

నమస్తే
# మహాప్రభ
ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ
తెలుగు దినపత్రిక
ఆదివారం
07-06-2026 సంపుటి : 01 సంచిక :76 పేజీలు : 08 వెల :₹ 5/-

BESQATI
besqati.com
Contact : info@besqati.com

Published From RANGAREDDY,TELANGANA.తెలంగాణ mahaaprabha.com NAMASTEY MAHAAPRABHA RNI NO : TGTEL/26/A0738 info@mahaaprabha.com



## అన్నామలైకు భారీ ఫాలోయింగ్

- 'వియ్ ద లీడర్స్' ఉద్యమానికి ఊహించని మద్దతు
- ఒక్కరోజులోనే 14 లక్షలమంది ఫాలోవర్లు చేరిక
- నైతిక రాజకీయాల కోసం 'ఏపీజే అబ్దుల్ కలాం కేంద్రం'
- వారసత్వ రాజకీయాలకు చరమగీతం పాడదాం: యువతకు పిలుపు

**చెన్నై జూన్ 6( మహాప్రభ )**

తమిళనాడు రాష్ట్ర భాజపా మాజీ అధ్యక్షుడు కె.అన్నామలై పార్టీకి రాజీనామా చేసిన 24గంటల్లోనే 14లక్షలకు పైగా ప్రజలు ఆయనతో చేరారు. తాను చేపట్టే 'వుయ్ ద లీడర్స్' ఉద్యమంలో చేరాలని కోరుతూ అన్నామలై ఆన్‌లైన్ లింక్ ను సామాజిక మాధ్యమాల్లో షేర్ చేయడంతో పెద్దఎత్తున స్పందన వస్తోంది. శుక్రవారం నుంచి శనివారం సాయంత్రానికి 14లక్షలకు పైగా ప్రజలు అందులో చేరారు. ఇంకా సభ్యత్వాలు కొనసాగుతున్నాయి. ఇదే పేరుతో ఆయన 2020లోనే స్వచ్ఛంద సంస్థను స్థాపించారు. శుక్రవారం అన్నామలై మాట్లాడుతూ.. నైతిక రాజకీయాల కోసం ఏపీజే అబ్దుల్ కలాం కేంద్రాన్ని

-మిగతా 3 లో



# సహారా ఎడారిలో విషాదం..

### దాహంతో 49 మంది మృతి

- మధ్యలో ఆగిపోయిన ట్రక్కు..
- రోజుల తరబడి ఎడారిలో చిక్కుకున్న ప్రయాణికులు
- ఇద్దరి సాహసంతో వెలుగులోకి ఘటన
- ఎండ తీవ్రత, నీటి కొరతతో ప్రాణాలు కోల్పోయిన వలసదారులు
- ట్రక్కు చుట్టూ మృతదేహాలు..
- సహారా ఎడారిలో హృదయవిదారక దృశ్యాలు

**సహారా జూన్ 6( మహాప్రభ )**

పశ్చిమాఫ్రికాలో అత్యంత విషాదకర ఘటన చోటుచేసుకుంది. సహారా ఎడారిలో తాగేందుకు నీరు దొరక్క దాహంతో 49 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరు ప్రయాణిస్తున్న ట్రక్కు ఆగిపోవడంతో వీరంతా కొన్ని రోజుల పాటు ఎడారిలో నిలిచిపోయినట్లు అధికారులు తెలిపారు. నైజర్ దేశంలో ఈ దిగ్భ్రాంతికర ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. నైజర్‌కు చెందిన కొంతమంది తమ బంధువులతో పండుగ చేసుకునేకుందుకు పక్కనే ఉన్న మాలి దేశానికి ట్రక్కులో బయల్దేరారు. ఆ వేడుక ముగించుకొని తిరిగివస్తుండగా..

-మిగతా 3 లో

## అష్టదరిద్రులు అడ్డంపడ్డా
# అభివృద్ధి ఆగదు


### ఎవరెంత ఏడ్చినా.. ఆర్ఆర్ఆర్ నిర్మిస్తాం

- వ్యవసాయాన్ని పండగ చేయడమే మా లక్ష్యం
- వరి వేస్తే ఉరి అనే రోజులు పోయాయి
- కాళేశ్వరం లేకున్నా లక్ష టన్నుల ధాన్యం పండింది
- ఇంతకాలం ఎక్కడ నీళ్లున్నా కాళేశ్వరం అంటూ ప్రచారం
- ధాన్యం కొనకుంటే మోడీ సంగతి తేలుస్తాం
- అభివృద్ధి నిరోధకంగా బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు
- కోహెడ పండ్ల మార్కెట్‌కు శంకుస్థాపనలో సిఎం రేవంత్ రెడ్డి

రంగారెడ్డి జిల్లాలో రూ.2,284 కోట్ల వ్యయంతో నిర్మించనున్న సమీకృత పండ్ల మార్కెట్, ఇంటిగ్రేటెడ్ సబ్‌రిజిస్ట్రార్ కాంప్లెక్స్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ మార్కెట్ అంతర్జాతీయ స్థాయి గుర్తింపు తెచ్చిపెడుతుందని, రైతులకు మెరుగైన సదుపాయాలు కల్పించడంతో పాటు రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి కొత్త దిశ చూపుతుందని ఆయన పేర్కొన్నారు. అభివృద్ధి పనులను ఎవరూ అడ్డుకోలేరని స్పష్టం చేస్తూ, తెలంగాణను ప్రపంచస్థాయి నగరాలు, పారిశ్రామిక కేంద్రాల సరసన నిలిపే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని వెల్లడించారు.

3



## చంద్రబాబుతో కుమ్మక్కై తెలంగాణకు ద్రోహం..

- సీఎం రేవంత్‌రెడ్డిపై హరీశ్ రావు ఫైర్
- బీఆర్ఎస్ పాదయాత్ర భయంతోనే సీఎంకు నిద్ర కరువైంది
- సాగునీటి ప్రాజెక్టులపై మమ్మల్ని విమర్శించే నైతిక హక్కు రేవంత్‌కు లేదు
- కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లయినా పాలమూరుకు చేసిందేమీ లేదు
- ఏపీ 75 శాతం కృష్ణా నీటిని వాడుకుంటుంటే.. తెలంగాణ సర్కార్ నిమ్మకు నీరెత్తినట్లుంది
- కృష్ణా జలాల వైఫల్యంపై రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి క్షమాపణ చెప్పాలి

**హైదరాబాద్ జూన్ 6( మహాప్రభ )**

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు సందర్శనలో సీఎం రేవంత్ రెడ్డి చేసిన విమర్శలకు బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు గట్టి కౌంటర్ ఇచ్చారు. సీఎం రేవంత్ రెడ్డివి మతిలేని మాటలు అంటూ ఆయన తీవ్రస్థాయిలో దుయ్యబట్టారు.ఓ మీడియా ప్రతినిధితో మాట్లాడిన హరీశ్ రావు.. బీఆర్ఎస్ చేపట్టబోయే పాదయాత్ర భయంతో సీఎం రేవంత్ రెడ్డికి నిద్ర కరువైందన్నారు. సాగునీటి ప్రాజెక్టులపై తమను విమర్శించే నైతిక హక్కు ఆయనకు లేదని స్పష్టంచేశారు. అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు దాటుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం పాలమూరుకు చేసిందేమీ లేదని విమర్శించారు.సీఎం రేవంత్ రెడ్డి ఏఎ

-మిగతా 3 లో



## కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలి

- ప్రధాని చేతగానితనం వల్ల విద్యార్థులు రోడ్డున పడ్డారు
- వారికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుంది
- లిబర్టీ సర్కిల్ ధర్నాలో టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

**హైదరాబాద్ జూన్ 6( మహాప్రభ )**

నీట్ పరీక్ష వైఫల్యానికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. ప్రధాని చేతగానితనం వల్ల లక్షలాది మంది విద్యార్థులు రోడ్డున పడే పరిస్థితి దాపురించిందని ఆవేదన చెందారు. కేంద్ర ప్రభుత్వ అసమర్థతను వ్యతిరేకిస్తూ శనివారం లిబర్టీ సర్కిల్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు చేశారు. ఐదు రాష్ట్రాలు ఎన్నికలు అయిపోగానే పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి సామాన్యుల నడ్డి విరిచిందన్నారు.

పరీక్ష రద్దు కేంద్రం వైఫల్యమే..

ప్రధాని చేతగానితనం వల్ల విద్యార్థులు రోడ్డున పడే పరిస్థితి దాపురించింది. దేశవ్యాప్తంగా

-మిగతా 3 లో




# కాక్రోచ్‌లా.. విశ్వరూపం!

- ఢిల్లీలో జెన్ జెడ్ నిరసన
- కాక్రోచ్ తొలి కార్యక్రమం సక్సెస్
- విద్యావ్యవస్థ వైఫల్యాలపై ఆందోళనకు పిలుపు
- కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా డిమాండ్‌తో ధర్నా
- ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద శాంతియుత ఆందోళన
- సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ సహా భారీగా యువత హాజరు
- కాక్రోచ్ మాస్క్ ధరించి నిరసనలో పాల్గొన్న జెన్ జెడ్ తరం

3

నీట్ పేపర్ లీకేజీ వ్యవహారం, దేశ విద్యావ్యవస్థలో జరుగుతున్న లోపాలపై కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఢిల్లీ వేదికగా భారీ ఉద్యమం మొదలైంది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలనే డిమాండ్‌తో 'కాక్రోచ్ జనతా పార్టీ' వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే పిలుపునిచ్చిన జంతర్ మంతర్ శాంతియుత నిరసన ప్రదర్శనకు ఢిల్లీ పోలీసులు అధికారికంగా అనుమతి ఇచ్చారు. దీంతో శనివారం ఉదయం నుంచే జంతర్ మంతర్ వద్దకు యువత భారీగా తరలివచ్చారు. అక్కడ శాంతియుతంగా నిరసన ప్రదర్శన కొనసాగింది. ఈ నిరసనలో సాయంత్రం ఐదు గంటల వరకు కొనసాగుంది. నిరసనలో కాక్రోచ్ మాస్కులతో యూత్ పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధ మేఘాలు

- హోర్ముజ్ జలసంధిపై ఇరాన్ డ్రోన్ల దాడి.. కూల్చివేసిన యూఎస్ ఆర్మీ
- ప్రతికారంగా ఇరాన్ రాడార్ కేంద్రాలపై అమెరికా వైమానిక దాడులు
- కువైట్ విమానాశ్రయంపై డ్రోన్ల దాడి.. ఒకరి మృతి, పలువురికి గాయాలు
- సముద్రంలో ఇరాన్ చమురు ట్యాంకర్‌ను స్వాధీనం చేసుకున్న అమెరికా
- ఇరాన్ ఇంధన రంగంపై మరిన్ని కఠిన ఆర్థిక ఆంక్షలు
- హెజ్బుల్లా తిరస్కరణతో సంక్షోభంలో పడ్డ కాల్పుల విరమణ ఒప్పందం
- దక్షిణ లెబనాన్‌పై ఇజ్రాయెల్ బాంబుల వర్షం.. 9 మంది మృతి
- ఇజ్రాయెల్ దాడులు ఆపితేనే జలసంధి పునరుద్ధరణ: ఇరాన్ డిమాండ్

**టెహ్రాన్, జూన్ 6( మహాప్రభ )**

పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు మళ్లీ ముసురుతున్నాయి. హోర్ముజ్ జలసంధి లక్ష్యంగా ఇరాన్ ప్రయోగించిన నాలుగు డ్రోన్లను అమెరికా సైన్యం కూల్చివేసింది. దీనికి ప్రతీకారంగా, ఇరాన్ తీరప్రాంతంలోని నిఘా రాడార్ కేంద్రాలపై అమెరికా వైమానిక దాడులకు దిగింది. ఈ పరిణామం ఇరు దేశాల మధ్య కుదిరిన తాత్కాలిక కాల్పుల విరమణను తీవ్ర సంక్షోభంలోకి నెట్టింది. హోర్ముజ్ జలసంధి గుండా వెళ్లే అంతర్జాతీయ వాణిజ్య నౌకలకు ఇరాన్ డ్రోన్ల వల్ల తక్షణ ముప్పు పొంచి ఉందని అమెరికా సెంట్రల్ కమాండ్ స్పష్టం చేసింది.

-మిగతా 3 లో

## భూ దందాను..
# అడ్డుకుంటాం

### లక్షల కోట్ల విలువైన భూమి స్వాహా




- సీఎం కుటుంబ సభ్యులతో సహా ప్రజాప్రతినిధులు భాగస్తులు
- పేరుకే రేవంత్ రెడ్డి పాలన.. నడుస్తుంది కేటీఆర్ పాలనే
- కేటీఆర్ అంటే కొండల్ రెడ్డి, తిరుపతి రెడ్డి, రేవంత్ రెడ్డి
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై విరుచుకుపడ్డ కవిత

**హైదరాబాద్, జూన్ 6( మహాప్రభ )**

లక్ష కోట్ల ప్రభుత్వ భూమిని రేవంత్ రెడ్డి సర్కార్ పెద్దలకు అప్పగిస్తోందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. సీఎం కుటుంబ సభ్యులు, ప్రభుత్వ పెద్దలు, కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు భూదందాల్లో ఉన్నారని ఆరోపించారు. ప్రభుత్వ భూములను సుప్రీంకోర్టు వరకు వెళ్లి కాపాడుతామని స్పష్టం చేశారు. హైడ్రా.. పేదల కాలనీల్లో దాడులు చేసి ఆ భూములను పెద్దలకు అప్పగిస్తోందని మండిపడ్డారు. శ్రీ ఆదిత్య కంపెనీ రివర్ బెడ్‌పైన ప్రాజెక్టు కడుతోందని.. ఆ కంపెనీ వెనుక ఓ ఎంపీ ఉన్నారని, శ్రీ ఆదిత్య కంపెనీకి బీఆర్ఎస్ హయాంలోనే పర్మిషన్ ఇచ్చారని..

-మిగతా 3 లో



## కోడింగ్‌లో.. భారత్ భేష్

- ఐటీ రంగంలో భారత్ తిరుగులేని శక్తి
- భారత విద్యా, ప్రతిభ ప్రమాణాలు అద్భుతం
- భారత్, రష్యది సోదర సంబంధమన్న పుతిన్
- పాశ్చాత్య దేశాల ఒత్తిళ్లకు భారత్ లొంగదని పునరుద్ఘాటన
- ప్రధాని మోదీ నాయకత్వానికి పుతిన్ కితాబు

**న్యూఢిల్లీ, జూన్ 6( మహాప్రభ )**

భారతదేశ ప్రతిభ, విద్యా ప్రమాణాలపై రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రశంసల జల్లు కురిపించారు. ఇరుదేశాల మధ్య ఉన్న సంబంధాలు కేవలం దౌత్యపరమైనవి కావని, అవి పూర్తి నమ్మకం, సోదర భావంతో కూడుకున్నవని స్పష్టం చేశారు. రష్యాలో జరుగుతున్న ప్రతిష్ఠాత్మక 'సెయింట్ పీటర్స్‌బర్గ్ అంతర్జాతీయ ఆర్థిక వేదిక' (ఎస్పీఈఐఎఫ్ 2026) ప్లీనరీలో మాట్లాడుతూ.. భారతదేశానికి ఉన్న మానవ వనరుల శక్తిని పుతిన్ ప్రత్యేకంగా కొనియాడారు. సాంకేతిక రంగంలో భారతీయ ఐటీ నిపుణులు, సాఫ్ట్‌వేర్ డెవలపర్లు ప్రపంచవ్యాప్తంగా అద్వితీయమైన గుర్తింపు తెచ్చుకున్నారని ప్రశంసించారు. "భారతదేశ ప్రజలు ఎంత ప్రతిభావంతులో, ఎంతటి విద్యావంతులో మాకు బాగా తెలుసు. ముఖ్యంగా కోడింగ్ రంగంలో భారతీయులు ప్రపంచ ప్రఖ్యాతి గాంచారు. అంతర్జాతీయ ఐటీ పరిశ్రమలో ఇండియానే లీడర్" అని పుతిన్ పేర్కొన్నారు. ఇదే వేదికపై భారత వ్యూహాత్మక స్వతంత్ర విదేశాంగ విధానాన్ని పుతిన్ ఆబాలించారు. రష్యాతో సంబంధాలను తగ్గించుకోవాలంటూ అమెరికా సహా పాశ్చాత్య దేశాలు ఒత్తిడి తెచ్చాయని, భారత్ వాటిని తిప్పికొట్టిందని వ్యాఖ్యానించారు. భారత్ లేదా చైనా లాంటి సార్వభౌమాధికారం ఉన్న దేశాలు విదేశాల నుంచి వచ్చే ఎలాంటి ఆదేశాలను ఖాతరు చేయవని, స్వతంత్ర నిర్ణయాధికారమే

-మిగతా 3 లో


## ప్లాస్టిక్ కరెన్సీని పరిశీలిస్తున్నాం.. ఆర్బీఐ గవర్నర్

3 లో




## ఐరాసలో పాకిస్థాన్‌కు భారత్ గట్టి కౌంటర్

**మీ అసత్య వాదనలు వాస్తవాన్ని మార్చలేవు..**



**న్యూఢిల్లీ జూన్ 6( మహాప్రభ )**
పాకిస్థాన్ ప్రతినిధి అసిమ్ ఇఫ్తికార్ అహ్మద్ కశ్మీర్ అంశాన్ని ప్రస్తావించగా ఐక్యరాజ్యసమితి లో భారత శాశ్వత ప్రతినిధి హరీశ్ పర్వతనేని తీవ్రంగా స్పందించారు. జమ్ముకశ్మీర్ కేంద్రపాలిత ప్రాంత భాగం భారత్ లో అంతర్భాగమని, ఎప్పటికీ విడదీయలేనిదని అన్నారు. దీనికి విరుద్ధంగా చేసే వాదనలకు చారిత్రక ఆధారాలు లేవని చెప్పారు. పాకిస్థాన్ చేస్తున్న నిరాధార వాదనలు ఈ వాస్తవాన్ని మార్చలేవని అన్నారు. ఐరాస వేదికలను పాకిస్థాన్ తన రాజకీయ ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేస్తోందని విమర్శించారు.మరోవైపు పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లోని గిల్గిట్-బల్టిస్థాన్‌లో జూన్ 7న ఎన్నికలు నిర్వహించాలన్న పాకిస్థాన్ నిర్ణయంపై భారత విదేశాంగ శాఖ తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. ఆ ప్రాంతాన్ని పాకిస్థాన్ ఆక్రమించుకుందని స్పష్టంచేసింది. అక్కడ జరుగుతున్న మానవ హక్కుల ఉల్లంఘనలు, ఆర్థిక దోపిడీని కప్పిపుచ్చుకోవడానికే ఈ ఎన్నికల నాటకానికి తెరలేపిందని ఆరోపించింది. ఆక్రమిత ప్రాంతాలను తక్షణమే ఖాళీ చేయాలని భారత్ డిమాండ్ చేసింది. అయితే గిల్గిట్-బల్టిస్థాన్ ఎన్నికలపై భారత్ చేసిన వ్యాఖ్యలను పాకిస్థాన్ విదేశాంగ కార్యాలయం తోసిపుచ్చింది. భారత్ ఆరోపణలు నిరాధారమైనవని పేర్కొన్నది.

## సుఖోయ్-57 తయారీ కోసం భారత్‌కు సహకరిస్తాం



**న్యూఢిల్లీ జూన్ 6( మహాప్రభ )**
ఫిఫ్త్ జనరేషన్ సుఖోయ్-57ని భారత్‌తో కలిసి సంయుక్తంగా ఉత్పత్తి చేసేందుకు రష్యా అనుకూలంగా ఉంది. రష్యా అధ్యక్షుడు పుతిన్ ఈ విషయాన్ని వెల్లడించారు. భారత విదేశాంగ విధానాన్ని పుతిన్ ప్రశంసించిన విషయం తెలిసిందే. సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో జరుగుతున్న సమావేశాల నేపథ్యంలో ఆయన మీడియాతో మాట్లాడారు. అక్కడ సుఖోయ్-57 యుద్ధ విమానం తయారీకి సంబంధించిన అప్‌డేట్ కూడా ఇచ్చారు. భారత్‌తో రక్షణ సహకారాన్ని మరింత బలోపేతం చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. దీనిలో భాగంగానే స్టీల్త్ ఫైటర్ విమానం సుఖోయ్-57ని రెండు దేశాలు కలిసి తయారీ చేయనున్నట్లు చెప్పారు.అడ్వాన్సడ్ ఫైటర్ జెట్ తయారీ అంశంలో భారత్‌తో ఒప్పందం కుదుర్చుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. సుఖోయ్-57 విమానాన్ని సంయుక్తంగా డెవలప్ చేసే అంశంలో భారత్‌కు స్నేహ హస్తాన్ని చాచామన్నారు. ప్రస్తుతం ఉన్న యుద్ధ విమానాల్లో ఇదే బెస్ట్ అని తెలిపారు. సంయుక్తంగా ఈ యుద్ధ విమానం తయారీ అంశంలో భారత్‌పై ఎటువంటి వత్తిడి ఉండబోదన్నారు. అయితే ఈ అంశంపై కేంద్ర రక్షణ శాఖ తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని భారత విదేశాంగ శాఖ చెప్పింది.

## అందుకే టీవీకే సర్కారుకు పరోక్ష మద్దతు



**న్యూఢిల్లీ జూన్ 6( మహాప్రభ )**
తమిళనాడు లో రాష్ట్రపతి పాలనను నివారించేందుకే నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం ప్రభుత్వ ఏర్పాటుకు తమ మిత్రపక్షాలు మద్దతివ్వడానికి అనుమతించామని డీఎంకే అధినేత మాజీ ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. గవర్నర్ ద్వారా బీజేపీ జోక్యాన్ని అడ్డుకోవడమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టంచేశారు. డీఎంకే దయాదాక్షిణ్యాలపైననే టీవీకే ప్రభుత్వం ఆధారపడి ఉందని వ్యాఖ్యానించారు. శనివారం చెన్నైలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన ఈ కీలక విషయాలను వెల్లడించారు.కాగా, 2026 ఏప్రిల్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 234 స్థానాలకుగాను టీవీకే 108 సీట్లు గెలుచుకుని అతిపెద్ద పార్టీగా అవతరించింది. అయితే ప్రభుత్వం ఏర్పాటుకు అవసరమైన 118 సీట్ల మెజారిటీని ఆ పార్టీ సాధించలేకపోయింది. ఈ నేపథ్యంలో డీఎంకే కూటమిలోని సీపీఐ, సీపీఎం, వీసీకే వంటి పార్టీలతోపాటు, కూటమి నుంచి విడిపోయిన కాంగ్రెస్ మద్దతుతో టీవీకే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. మిత్రపక్షాలు టీవీకేకు మద్దతిస్తామని తనను సంప్రదించినప్పుడు, అది వారి ప్రజాస్వామ్య హక్కు అని భావించి తాను అడ్డుకోలేదని స్టాలిన్ వివరించారు.

# ఆస్ట్రేలియాలో లక్ష బొద్దింకలు సీజ్.

**దేశ చరిత్రలో ఇదే పెద్ద ఆపరేషన్..!**



**న్యూఢిల్లీ జూన్ 6( మహాప్రభ )**
ఆస్ట్రేలియా లో నిషేధిత బొద్దింకల కోసం అధికారులు జరిపిన ఒక భారీ ఆపరేషన్‌లో లక్షకుపైగా బొద్దింకలు సీజయ్యాయి. దేశంలోకి దిగుమతి చేసుకోవడం లేదా పెంచడంపై నిషేధం ఉన్న ఈ బొద్దింకలను ఒకే బ్రీడర్ నుంచి పట్టుకోవడం సంచలనం సృష్టిస్తోంది. దేశ చరిత్రలో అకశేరుకాలకు (వెన్నెముక లేని జీవులు) సంబంధించి ఇదే అతిపెద్ద ఆపరేషన్ అని అధికారులు వెల్లడించారు. న్యూసౌత్ వేల్స్ రాష్ట్రంలోని బాథర్స్ట్ నగరంలో మే నెలలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఒక కమర్షియల్ బ్రీడర్ వద్ద జరిపిన సోదాల్లో మడగాస్కర్ హిస్సింగ్ డూబియా జాతులకు చెందిన లక్షకుపైగా బొద్దింకలను గుర్తించినట్లు ఆస్ట్రేలియా పర్యావరణ విభాగం తెలిపింది.వీటి విలువ సుమారు 2,00,000 ఆస్ట్రేలియన్ డాలర్లు (రూ. 1.35 కోట్లు) ఉంటుందని అంచనా. ఈ మడగాస్కర్ బొద్దింకలు ప్రపంచంలోనే అతిపెద్ద జాతులలో ఒకటి. ఇవి 5 నుంచి 8 సెంటీమీటర్ల పొడవు ఉంటాయి. సాధారణ ఆస్ట్రేలియన్ బొద్దింకల కన్నా ఇవి చాలా పెద్దవి. స్థానికంగా పాములను పట్టే స్టెఫానీ లెస్సర్ మాట్లాడుతూ.. పెంపుడు సరీసృపాలకు తక్కువ ఖర్చుతో కూడిన ఆహారం అందించేందుకు ఈ పెద్ద బొద్దింకలను అమ్ముతున్నారని అభిప్రాయపడ్డారు. ఆస్ట్రేలియాలో కఠినమైన బయోసెక్యూరిటీ నిబంధనలు అమల్లో ఉన్నాయి. దేశీయ వృక్ష, జంతుజాలాన్ని కాపాడేందుకు ఇలాంటి విదేశీ జీవులను పెంచడం, అమ్మడం చట్టవిరుద్ధం.విదేశీ బొద్దింకలు పర్యావరణానికి ప్రమాదకరం కావచ్చని, స్థానిక జీవవైవిధ్యానికి హాని కలిగించడంతో పాటు వ్యాధులను వ్యాప్తి చేసే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరించారు. ఈ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవని స్పష్టంచేశారు. అయితే బాథర్స్ట్‌కు చెందిన బ్రీడర్‌పై ప్రస్తుతానికి ఎలాంటి అభియోగాలు నమోదు చేయలేదని అధికారులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న బొద్దింకలన్నింటికీ కారుణ్య మరణం విధించనున్నట్లు వారు తెలిపారు.

## హిమాచల్ ప్రదేశ్‌లో భూకంపం

**- రిక్టర్ స్కేలుపై 5.0 తీవ్రత..**



**సిమ్లా జూన్ 6( మహాప్రభ )**
హిమాచల్ ప్రదేశ్‌లో భారీ భూకంపం సంభవించింది. రాత్రి వేళ ఒక్కసారిగా భూమి కంపించడంతో ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. నేషనల్ సెంటర్ ఫర్ సీస్మోలజీ సమాచారం ప్రకారం, ఈ భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 5.0 గా నమోదైంది. చంబా జిల్లాలో భూకంప కేంద్రం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. చంబా, ధర్మశాల, డల్హౌసీ, భర్మౌర్, కాంగ్రా, కులు మరియు రాజధాని సిమ్లా సహా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భూమి కొన్ని సెకన్ల పాటు బలంగా కంపించింది. ఈ భూకంప ప్రభావం కేవలం హిమాచల్ ప్రదేశ్‌కే పరిమితం కాలేదు. పక్కనే ఉన్న పంజాబ్, హర్యానా రాష్ట్రాలతో పాటు చండీగఢ్ తదితర ఉత్తర భారత ప్రాంతాల్లోనూ స్వల్ప ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. చంబా పరిధిలోని హోలీ ప్రాంతంలో కొన్ని ఇళ్లకు స్వల్పంగా దెబ్బతిన్నట్లు (గోడలకు పగుళ్లు) సమాచారం. ఎక్కడా ఎలాంటి ప్రాణ నష్టం కానీ, భారీ ఆస్తి నష్టం కానీ సంభవించలేదని అధికారులు వెల్లడించారు.

## లాలూ, రబ్రీ దేవికి జెడ్ ప్లస్ సెక్యూరిటీ ఉపసంహరణ..

**- ఆర్జేడీ కార్యకర్తలు కర్రలతో కాపలా**



**పాట్నా: జూన్ 6( మహాప్రభ )**
బీహార్ మాజీ ముఖ్యమంత్రులైన లాలూ ప్రసాద్ యాదవ్, రబ్రీ దేవికి 'జెడ్ ప్లస్' భద్రతను ఆ రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉపసంహరించింది. దీనిపై వారిద్దరూ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కొత్తగా ఏర్పాటు చేసిన తక్కువ స్థాయి భద్రతా సిబ్బందిని వెనక్కి పంపించి వేశారు. ఈ నేపథ్యంలో లాలూ యాదవ్, రబ్రీ దేవిల భద్రత కోసం వారి బంగ్లా వద్ద ఆర్జేడీ కార్యకర్తలు కర్రలతో కాపలా ఉన్నారు. ఈ ఫొటోలు, వీడియో క్లిప్స్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.కాగా, లాలూ, రబ్రీదేవి కుమారుడు, బీహార్ అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడైన తేజస్వి యాదవ్ కూడా తన వై కేటగిరీ భద్రతను వెనక్కి పంపించారు. అయితే తన తల్లిదండ్రులు, మాజీ ముఖ్యమంత్రులైన లాలూ ప్రసాద్ యాదవ్, రబ్రీ దేవికి జెడ్ ప్లస్ సెక్యూరిటీని తగ్గించడంపై వారి కుమార్తె రోహిణి ఆచార్య స్పందించారు. తన కుటుంబానికి హాని కలిగించాలనే దురుద్దేశంతోనే వారి భద్రతను తొలగించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని ఆరోపించారు.

## గోవాలో విషాదం..

**-రోడ్డుపై చెత్త పడేసిన యువకుడు..**
**వీడియో వైరల్ కావడంతో ఆత్మహత్య**



**న్యూఢిల్లీ జూన్ 6( మహాప్రభ )**
సోషల్ మీడియా కారణంగా గోవాలో ఒక విద్యార్థి ప్రాణాలు కోల్పోయాడు. రోడ్డుపై ఒక వ్యక్తి చెత్త పడేస్తుండగా వైరల్ కావడం, అతడిపై ట్రోలింగ్ జరగడం వంటి కారణాలతో కుంగిపోయిన యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన గురువారం రాత్రి జరిగినట్లు స్తానిక పోలీసులు తెలిపారు. ఉత్తర గోవాలోని మాపుసాకు చెందిన సామ్యూల్ గార్విన్ డే బ్రగాన్సా అనే 2 ఏళ్ల విద్యార్థి ఇటీవల రోడ్డుపై చెత్త పడేశాడు. దీన్ని అక్కడివారెవరో వీడియో తీసి, సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఆ వీడియో వైరల్ అయింది. పెద్ద చర్చకు దారితీసింది. సామ్యూల్‌పై ట్రోల్ జరిగింది. అందరూ అతడి చర్యను విమర్శించారు. తను చేసిన పని నిర్లక్ష్యానికి నిదర్శనం అని, అతడు చేసిన పని వల్ల అంటువ్యాధులు ప్రబలే అవకావం ఉందని విమర్శించారు. ఈ నేపథ్యంలో సామ్యూల్‌పై మపుసా పోలీస్ స్టేషన్‌లో కేసు కూడా నమోదైంది. దీంతో సామ్యూల్ తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. అటు ట్రోలింగ్, పోలీస్ కేసు కారణంగా తీవ్ర ఒత్తిడికి గురైన అతడు గురువారం రాత్రి తన బాత్‌రూమ్‌లో పిస్టల్‌తో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు.. గాయపడిన అతడిని దగ్గర్లోని ఆస్పత్రికి తరలించారు. అయితే, అప్పటికీ అతడు మరణించినట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనతో సామ్యూల్ కుటుంబం పోలీసులకు ఫిర్యాదు చేసింది. అతడు ఆత్మహత్యకు చేసుకునేందుకు కారణమైన వ్యక్తులపై కేసు నమోదు చేసి, అరెస్టు చేయాలని స్తానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. సామ్యూల్ ఆత్మహత్యపై ప్రభుత్వం స్పందించింది. అతడి ఆత్మహత్యపై విచారణ జరిపి, నివేదిక ఇవ్వాలని గోవా సీఎం ప్రమోద్ సావంత్ ఆదేశించారు. పోలీసులు దీనిపై విచారణ జరుపుతున్నారు.

## మమత ఎంపీ సీటు కోసం సౌరవ్ గంగూలీ రాయబారం..





**న్యూఢిల్లీ జూన్ 6( మహాప్రభ )**
పశ్చిమ బెంగాల్ మాజీ సీఎం, టీఎంసీ అదినేత్రి మమతా బెనర్జీ రాజకీయ భవిష్యత్ చుట్టూ అనేక ప్రచారాలు జరుగుతున్నాయి. ఆమె పార్లమెంట్ స్తానం నుంచి పోటీ చేయనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ విషయంలో టీమిండియా మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ చొరవ తీసుకుంటున్నారని ప్రచారం జరుగుతోంది. తాజా అసెంబ్లీ ఎన్నికల్లో మమత ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయారు.ఆమె పార్టీ టీఎంసీ కూడా ఘోర పరాజయం పాలైంది. దీంతో ఇప్పుడు ఆమె రాజకీయ భవిష్యత్ ఏంటనేది ప్రశ్నార్థకంగా మారింది. తాజా సమాచారం ప్రకారం ఆమె లోక్‌సభకు ఎంపీగా పోటీ చేయాలనుకుంటున్నారనే ప్రచారం మొదలైంది. ప్రస్తుతం బెంగాల్‌లో ఎన్నికలేమీ లేవు. అందుకు తన పార్టీకి చెందిన బహరాంపూర్ ఎంపీ యూసుఫ్ పఠాన్‌ను రాజీనామా చేయించాలని భావిస్తున్నారు. ఆయన రాజీనామా చేస్తే అక్కడ ఉప ఎన్నిక వస్తుంది. ఆ స్తానం నుంచి మమత పోటీ చేస్తారు. అయితే, ఈ విషయంలో యూసుఫ్ పఠాన్‌ను ఒప్పించేదెవరు..? ఈ విషయంలోనే సౌరవ్ గంగూలీ పేరు తెరపైకి వచ్చింది. మమత తరఫున యూసుఫ్ పఠాన్‌తో సౌరవ్ గంగూలీ రాయబారం నడిపారని ప్రచారం జరుగుతోంది.ఈ మేరకు బెంగాల్‌కు చెందిన ఒక పత్రిక కథనాన్ని ప్రచురించింది. యూసుఫ్ పఠాన్‌ను రాజీనామా చేయాలని సౌరవ్ గంగూలీ కోరినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే, ఈ ప్రచారాన్ని సౌరవ్ ఖండించారు. ఈ వార్తలో నిజం లేదన్నారు. తాను ఎప్పుడూ యూసుఫ్ పఠాన్‌ను కలవలేదన్నారు. తాను యూసుఫ్‌తో మధ్యవర్తిత్వం వహించడం లేదని స్పష్టం చేశారు.

# సహారా ఎడారిలో విషాదం..

మొదటి తరువాయి

వీరు ప్రయాణిస్తున్న ట్రక్కు అసమాకా అనే సరిహద్దు ప్రాంతానికి 80 కిలోమీటర్ల దూరంలో ఆగిపోయింది. అయితే, ఈ ప్రాంతం నిర్మానుష్యంగా ఉండటంతో సాయం చేసేవారు దొరకలేదు. డ్రైవర్‌తో పాటు అందులోని ప్రయాణికులు ట్రక్కును మరమ్మతు చేసేందుకు ప్రయత్నించినా ఫలించలేదు. దీంతో వారంతా కొన్ని రోజుల పాటు ఎడారిలోనే ఉండాల్సి వచ్చింది. అప్పటికే వారి వద్ద ఉన్న నీటి నిల్వలు నిండుకున్నాయి. ఎడారిలో నీటి జాడ లేకపోవడంతో వారు దాహంతో అల్లాడిపోయారు.
చివరకు ఇద్దరు వ్యక్తులు దాదాపు 50 కిలోమీటర్లకు పైగా కాలినడకన వెళ్లి నీరు తాగి అక్కడినుంచి అసమాకా పట్టణానికి చేరుకున్నారు. అక్కడ అధికారులను కలిసి విషయం చెప్పారు. అప్రమత్తమైన అధికారులు ఘటనా స్థలానికి చేరుకోగా.. హృదయ విదారక దృశ్యాలు కన్పించాయి. ట్రక్కు చుట్టూ డజన్ల కొద్దీ మృతదేహాలు కన్పించాయని అధికారులు తెలిపారు. విపరీతమైన వేడి, ఉక్కపోత, నీరు లేక 49 మంది ప్రాణాలు కోల్పోయినట్లు వెల్లడించారు. అయితే, ట్రక్కు ఆగిపోవడానికి కారణమేంటీ, వీరు ఎడారిలో ఎన్ని రోజులు చిక్కుకుపోయారన్న దానిపై స్పష్టత లేదు. సాధారణంగా ఈ ఎడారి జోన్ మీదుగా పౌరులు రాకపోకలు సాగించడం చాలా అరుదని స్థానిక అధికారులు వెల్లడించారు. ఎక్కువ ఆఫ్రికా దేశాల నుంచి యూరప్‌కు వలసవెళ్లేవారు ఈ మార్గాన్ని ఆశ్రయిస్తారని తెలిపారు.
గతంలోనూ అనేక మంది ఇసుక వేడి,
దాహం, ఆకలితో ఈ మార్గంలో ప్రాణాలు విడిచినట్లు గుర్తుచేసుకున్నారు.

# కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలి

మొదటి తరువాయి

లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్ర ప్రభుత్వం చెలగాటమాడుతోంది. నీట్-యూజీ 2026 పరీక్ష పేపర్ లీక్ ఆరోపణల నేపథ్యంలో పరీక్షను రద్దు చేయడం కేంద్ర ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం. నీట్ పరీక్ష వైఫల్యానికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని మహేశ్ కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు.

**కాంగ్రెస్ అండగా ఉంటుంది..**

విద్యార్థులు నెలల తరబడి కష్టపడి సిద్ధమైతే, ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా వారి శ్రమ వృథా అయింది. చైనా వాళ్లు దేశంలోకి చొచ్చుకొని రావడానికి కారణం కేంద్ర ప్రభుత్వ చేతగాని తనమే. కేంద్ర ప్రభుత్వ ఉదాసీనత వల్లే నీట్ పరీక్షల వైఫల్యం జరిగింది. నష్టపోయిన విద్యార్థుల కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుంది. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రజా పాలన ప్రభుత్వం విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి పెట్టింది అని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.

# అన్నామలైకు భారీ ఫాలోయింగ్

మొదటి తరువాయి

కోయంబత్తూర్‌లో ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. త్వరలో కొత్త పార్టీ పెట్టనున్నట్లు ప్రకటించారు. ఐపీఎస్ ఉద్యోగానికి రాజీనామా చేసి మంచి ఉద్దేశంతో నాడు భాజపాలో చేరానని, అదే ఉద్దేశంతో నేడు కొత్త పార్టీ వైపు అడుగులు వేస్తున్నట్లు తెలిపారు. ఒక సామాన్యుడు రాజకీయాల్లోకి రావడం చాలా పెద్ద విషయమని అన్నారు. నేతల దగ్గరకు ప్రజలకు తీసుకువెళ్లడం కాకుండా.. రాజకీయాలనే ప్రజల వద్దకు తీసుకువెళ్లడమే తన ఆలోచన అని పేర్కొన్నారు. సంప్రదాయ, వంశపారంపర్య రాజకీయాలను అంతం చేయడానికి తనతో కలసిరావాలని యువతను కోరారు. వియ్ ది పీపుల్‌ను ప్రారంభించిన ఒక్క రోజులోనే కొత్తగా 14 లక్షల మంది వాలంటీర్లుగా తమ పేర్లను రిజిస్టర్ చేసుకున్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల బరిలోకి దిగడమే తన లక్ష్యమని అన్నామలై ఇప్పటికే స్పష్టం చేశారు. సామాన్యుల ప్రయోజనాలే కేంద్రంగా రాజకీయాలు ఉండాలని చెప్పారు. అసలైన మార్పునకు దారితీసే రాజకీయాల అవసరం ఉందని అన్నారు. భవిష్యత్తు తరాలకు గట్టి పునాదులు వేసేందుకు తాను ప్రయత్నిస్తున్నానని చెప్పారు. వ్యక్తి పూజకు, కుటుంబరాజకీయాలకు తావులేదని చెప్పారు. తన ఉద్యమానికి వాలంటీర్లే జీవనాడి అని అన్నారు. కొత్త తరం నాయకులను వెలుగులోకి తీసుకొచ్చేందుకు, క్షేత్రస్థాయిలో అసలైన మార్పు కోసం వాలంటీర్లు ప్రయత్నించాలని పిలుపునిచ్చారు. విద్య, ఆరోగ్యం, పర్యావరణం.. ఇలా తమకు నచ్చిన రంగాన్ని వాలంటీర్లు ఎంచుకుని చేతనైన మేరకు తాముంటున్న చోట మేలి మార్పులు తీసుకురావాలని కోరారు. రాబోయే రోజులు మరింత మెరుగ్గా ఉండేలా తాను చేస్తున్న ప్రయత్నాలను చేయూతను ఇవ్వాలని పిలుపునిచ్చారు.

## చంద్రబాబుతో కుమ్మక్కై

# తెలంగాణకు ద్రోహం..

మొదటి తరువాయి

సీఎం చంద్రబాబుతో కుమ్మక్కై తెలంగాణకు తీవ్ర ద్రోహం చేస్తున్నారని మండిపడ్డారు. అందుకే ఈ ఏడాది ఆంధ్రప్రదేశ్ 75 శాతం కృష్ణా నీటిని వాడుకుంటే, తెలంగాణ కేవలం 25 శాతానికే పరిమితమైందని విమర్శించారు. ఈ వైఫల్యానికిగానూ సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో పాలమూరు పరిధిలో 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందించామని గుర్తుచేశారు. పాలమూరు రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా మోసం చేసిందన్నారు.

## భూ దందాను..

# అడ్డుకుంటాం

మొదటి తరువాయి

దాన్ని ముట్టుకునే దమ్ము ప్రభుత్వానికి ఉందా అని ప్రశ్నించారు.

**నడుస్తుంది కేటీఆర్ పాలనే..**

సీఎం రేవంత్ రెడ్డికి నీళ్లపై అవగాహన లేదని కవిత విమర్శించారు. మహారాష్ట్ర సీఎం అపాయింట్‌మెంట్ ఇవ్వకపోతే ఏపీ సీఎం ఇచ్చారా? అని ప్రశ్నించారు. ఏపీ సీఎంతో మాట్లాడి 200 టీఎంసీల నీళ్లు తెచ్చి ఆ తర్వాత బనకచర్ల గురించి మాట్లాడాలన్నారు. అప్పుడు కేటీఆర్ పాలన నడిచిందని.. ఇప్పుడు కూడా కేటీఆర్ పాలనే నడుస్తోందన్నారు. అప్పుడు కేటీఆర్ అంటే కేసీఆర్, తన్నీరు హరీశ్ రావు, రామారావు.. ఇప్పుడు కేటీఆర్ అంటే కొండల్ రెడ్డి, తిరుపతి రెడ్డి, రేవంత్ రెడ్డి అని కవిత వ్యాఖ్యానించారు. కాంగ్రెస్, బీజేపీ స్వార్థంతో ఒరిగేదేమీ లేదని కవిత విమర్శించారు.

**పవన్ కొన్నది శిఖం భూమే..**

తెలంగాణ బరాబర్ ప్రజల జాగీరే అని.. పవన్ కల్యాణ్ జాగీర్ కాదని కవిత స్పష్టం చేశారు. ఆంధ్రా విషకోరల నుంచి తెలంగాణను కాపాడుకుంటామన్నారు. ఇక్కడకు వచ్చి రాజకీయం చేస్తామంటే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కు మద్దతిస్తే నాలుగు ఓట్లు వస్తాయని బీజేపీ భావిస్తోందని.. వచ్చే ఎన్నికల్లో బీజేపీకి ఉన్న 8 సీట్లు పోతాయన్నారు. పవన్ కల్యాణ్ 10 ఎకరాల శిఖం భూమిని కొనుగోలు చేశారని.. కోడికుంట సర్వే నంబర్ 706లో శిఖం భూమి ఉందన్నారు. రిజిస్ట్రేషన్ సమయంలో అనేక తప్పులు జరిగాయని.. ఆ భూమిని పవన్ తిరిగి ఇచ్చేయాలన్నారు. శిఖం భూమిలో వేసిన కంచెను పవన్ తొలగించాలని కవిత డిమాండ్ చేశారు.

# అష్టదరిద్రులు అడ్డంపడ్డా అభివృద్ధి ఆగదు


**-ఎవరెంత ఏడ్చినా.. ఆర్‌ఆర్‌ఆర్ నిర్మిస్తాం**
**-వ్యవసాయాన్ని పండగ చేయడమే మా లక్ష్యం**
**-వరి వేస్తే ఉరి అనే రోజులు పోయాయి**
**-కాళేశ్వరం లేకున్నా లక్ష టన్నుల ధాన్యం పండింది**
**-ఇంతకాలం ఎక్కడ నీళ్లున్నా కాళేశ్వరం అంటూ ప్రచారం**
**-ధాన్యం కొనకుంటే మోడీ సంగతి తేలుస్తాం**
**-అభివృద్ధి నిరోధకంగా బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు**
**-కోహెడ పండ్ల మార్కెట్‌కు శంకుస్థాపనలో సిఎం రేవంత్ రెడ్డి**




**రంగారెడ్డి,**
రంగారెడ్డి జిల్లాలోని కోహెడలో నిర్మించనున్న సమీకృత పండ్ల మార్కెట్ మనకు అంతర్జాతీయస్థాయి గుర్తింపు తీసుకొస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. స్థానికంగా పండ్ల మార్కెట్‌తో పాటు ఇంటిగ్రేటెడ్ సబ్‌రిజిస్ట్రార్ కాంప్లెక్స్‌కు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రసంగించారు. నగరంలోని పండ్ల మార్కెట్‌ను కోహెడకు తరలించినప్పుడు తాత్కాలిక టెంట్లు వేశారు. గాలివాన వచ్చినప్పుడు రైతులకు గాయాలయ్యాయి. ఇంటిగ్రేటెడ్ పండ్ల మార్కెట్ నిర్మిస్తానని నాడు ఎంపీగా ఉన్నప్పుడు హామీ ఇచ్చాను. పండ్లు, కూరగాయలు అన్నీ లభించేలా ఈ మార్కెట్‌ను నిర్మిస్తున్నాం అన్నారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో దారుణమైన పరిస్థితులు ఉన్నాయి. తాగేందుకు నీళ్లు ఉండవు.. కూర్చునేందుకు స్థలం ఉండదు. అందుకే అన్ని వసతులతో కూడిన ఇంటిగ్రేటెడ్ సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసులు నిర్మిస్తున్నాం. అంతర్జాతీయ సదుపాయాలు కల్పించుకుంటేనే.. మనది అంతర్జాతీయ నగరం అవుతుంది. ఎవరెంత ఏడ్చినా.. ఆర్‌ఆర్‌ఆర్ ఆగదు. అభివృద్ధి కూడా ఆగదు. వ్యవసాయం దండగ కాదు.. పండగ అని నిరూపిస్తున్నాం. కాళేశ్వరం కూలేశ్వరం అయినా.. దేశంలోనే అత్యధిక వరి పండిస్తున్నాం. వరి వేస్తే.. ఉరే అని చెప్పిన రోజులు కావు ఇవి. వరి రైతులకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తున్నాం అని గుర్తు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలపై రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అభివృద్ధికి అష్టదరిద్రులు అడ్డం పడుతున్నారని ధ్వజమెత్తారు. కాళ్లలో కట్టెలు పెట్టినా.. మూసీలో పడి దొర్లినా వాళ్లను పట్టించుకోమని విమర్శించారు. అసూయ పడేవాళ్లు, అజీర్ణం చేసుకునేవాళ్లు ఎప్పుడూ ఉంటారని ఎద్దేవా చేశారు. రూ.2,284 కోట్లతో 239 ఎకరాల్లో ఫ్రూట్ మార్కెట్ నిర్మిస్తున్నారు. చుక్కనీరు ఎత్తిపోయకుండా లక్షల మెట్రిక్ టన్నుల పంట పండలేదా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఎక్కడ నీళున్నా కాళేశ్వరం నీళ్లు అనేవారని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం కడితే కూలేశ్వరం అయిందని విమర్శించారు. కేసీఆర్ హయాంలో కాళేశ్వరాన్ని రూ.లక్ష కోట్లు వెచ్చిస్తే గోదావరి పాలయ్యాయని మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో విధ్వంసం చేస్తే.. మేం వికాసం వైపు నడిపిస్తున్నామని తెలిపారు. బీఆర్ఎస్, బీజేపీ నేతలు అసూయ, పగ తమపై చూపండని.. కానీ ప్రజలపై కాదని చెప్పారు. సమస్యలు వస్తే పారిపోమని.. నిలబడి కొట్లాడి పరిష్కరించుకుంటామని అన్నారు. ఫామ్‌హౌస్ కేడీతోనైనా, ఢిల్లీలో మోదీతోనైనా కొట్లాడేందుకు సిద్ధమని వ్యాఖ్యానించారు. చేతకాకపోతే దిగిపొమ్మంటున్నారని.. తాము అల్లాటప్పాగా రాలేదని చెప్పారు. కిషన్‌రెడ్డి, బండి సంజయ్ సంగతి చెబుతామని హెచ్చరించారు. మర్యాద తప్పితే.. పొలిమేరలు కూడా దాటనివ్వమని వార్నింగ్ ఇచ్చారు. మోదీని చూపి భయపెట్టాలనుకుంటే.. ఇక్కడెవరూ భయపడేవారు లేరని చెప్పుకొచ్చారు ఈనెల 15 తర్వాత వడ్లు కొనకపోతే కేంద్రం సంగతి చూస్తామని హెచ్చరించారు. మాకు మాటలే కాదని.. చేతలు కూడా తెలుసునని అన్నారు. కేంద్రం నుంచి నిధులు ఎలా తెచ్చుకోవాలో తమకు తెలుసునని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్ నగరం వేగంగా విస్తరిస్తోందని వ్యాఖ్యానించారు. భూముల ధరలు బాగా పెరిగాయని పేర్కొన్నారు. రియల్ ఎస్టేట్ పెరగడంతో వ్యవసాయం కుంటుపడిందని చెప్పుకొచ్చారు. హైదరాబాద్‌లో 1.34 కోట్ల మంది నివసిస్తున్నారని తెలిపారు. ఒకప్పుడు హైదరాబాద్ చుట్టూ కూరగాయలు పండేవని వెల్లడించారు. గడ్డిఅన్నారం నుంచి ఫ్రూట్ మార్కెట్‌ని ఇక్కడికి తరలించారని ప్రస్తావించారు. రేకుల షెడ్లు వేస్తే.. అవి గాలి దుమారానికి ఎగిరిపోయాయని అన్నారు. అంతర్జాతీయ స్థాయిలో మార్కెట్ నిర్మిస్తామని హామీ ఇచ్చామని చెప్పారు. పండ్ల మార్కెట్ కోసం మనం చేసిన ప్రయత్నాన్ని అడ్డుకోవాలని చూశారని ధ్వజమెత్తారు. అందరి అవసరాలు తీర్చేలా మార్కెట్ నిర్మాణం చేయబోతున్నామని స్పష్టం చేశారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌తో ఏటా రూ.8 వేల కోట్ల ఆదాయం వస్తుందని తెలిపారు. మన ప్రాంతంలో రైతులు అన్ని రకాల పండ్లు పండించాలని ఆకాంక్షించారు. ఫార్మా సిటీ వద్దని ఫ్యూచర్ సిటీ నిర్మాణం చేయబోతున్నామని వ్యాఖ్యానించారు. అంతర్జాతీయ స్థాయి కంపెనీలను ఇక్కడికి తీసుకురాబోతున్నామని వివరించారు. కాలుష్యం లేని పరిశ్రమలే ఈ ప్రాంతానికి వస్తాయని వెల్లడించారు. ఫ్యూచర్ సిటీ, మార్కెట్, ఆర్‌ఆర్‌ఆర్ వద్దంటూ అడ్డం పడుతున్నారని చెప్పుకొచ్చారు. వరంగల్ ఎయిర్‌పోర్టు వద్దని అడ్డుకుంటోందని ఆగ్రహించారు. గతంలో కావాలని మనం పోరాడితే.. ఇప్పుడు అష్టదరిద్రులు అడ్డం పడుతున్నారని దుయ్యబట్టారు. అభివృద్ధి చేద్దామంటే అడ్డుపడుతున్నారు.. ధర్నాలు చేస్తున్నారని ఫైర్ అయ్యారు. 2034 వరకు ప్రజాపాలన ఉంటుందని స్పష్టం చేశారు. ఔర్ ఏక్ బార్.. కాంగ్రెస్ సర్కార్.. తమ నినాదమని ఉద్ఘాటించారు. అభివృద్ధి పనులు చేసుకుంటూ ముందుకెళ్తామని చెప్పుకొచ్చారు. ఎంతమంది అడ్డం పడినా అభివృద్ధి పనులు ఆగవని తేల్చిచెప్పారు. సదుపాయాలు ఉంటేనే అంతర్జాతీయ స్థాయి నగరం అవుతుందని తెలిపారు. 'కారు' పూర్తిగా చెడిపోయి కార్ఖానాలో ఉంది. ఎన్ని మరమ్మతులు చేసినా.. చెడిపోయిన ఆ కారు ఇక పనికిరాదు. కేసీఆర్ కుర్చీ వేసుకొని కూర్చొని.. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు నిర్మిస్తానని చెప్పారు. కానీ.. గెలిచిన తర్వాత పట్టించుకోలేదు. మేం అభివృద్ధి చేస్తుంటే.. అధికారంలోకి రాగానే ఫ్యూచర్ సిటీ రద్దు చేస్తామని బీఆర్ఎస్ చెబుతోంది. కాలుష్యం వెదజల్లే ఫార్మాసిటీ వద్దని.. ఫ్యూచర్‌సిటీ నిర్మిస్తున్నాం. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన 500 కంపెనీలు తీసుకురావాలని యత్నిస్తున్నాం. బీఆర్ఎస్ నేతలు దశాబ్దంలోనే శతాబ్దానికి సరిపడా విధ్వంసం చేశారు. తెలంగాణలో పండిన ధాన్యాన్ని కొనలేని మోదీ గద్దె దిగాలి. రాహుల్ గాంధీని ప్రధాని చేసి.. మొత్తం ధాన్యాన్ని కేంద్రంతో కొనిపిస్తా. పాలమూరు-రంగారెడ్డికి జాతీయ హోదా తెస్తా. మెట్రో విస్తరణకు, ఆర్‌ఆర్‌ఆర్‌కు వెంటనే నిధులు తీసుకొస్తా అని సీఎం అన్నారు.

# కాక్రోచ్‌లా.. విశ్వరూపం!

- ఢిల్లీలో జెన్ జెడ్ నిరసన
- కాక్రోచ్ తొలి కార్యక్రమం సక్సెస్
- విద్యావ్యవస్థ వైఫల్యాలపై ఆందోళనకు పిలుపు
- కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా డిమాండ్‌తో ధర్నా
- ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద శాంతియుత ఆందోళన
- సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ సహా భారీగా యువత హాజరు
- కాక్రోచ్ మాస్క్ ధరించి నిరసనలో పాల్గొన్న జెన్ జెడ్ తరం



**న్యూఢిల్లీ,**

**నిరసనలో పాల్గొన్న అభిజీత్..**

కాగా, నిరసనకు వచ్చే వారు ఒక పుస్తకం, జాతీయ జెండా తీసుకురావాలని సీజేపీ నేత అభిజీత్ సూచించారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. జంతర్ మంతర్ వద్ద అందరినీ కలుసుకోవాలని ఎదురుచూస్తున్నానని పేర్కొన్నారు. ఈ ఉద్యమం ప్రేమ, శాంతి, రాజ్యాంగబద్ధ విలువల ఆధారంగా కొనసాగాలని తెలిపారు. నిరసనలో పాల్గొనేవారు పోలీసు సిబ్బందికి పూలు అందించికృతజ్ఞతలు తెలియజేశారు. ఉద్యమం హింసాత్మకంగా కాకుండా ప్రజాస్వామ్య పద్ధతుల్లో కొనసాగాలని, ప్రతి ఒక్కరూ సంయమనంతో వ్యవహరించాలని పిలుపునిచ్చారు. అందుకు అనుగుణంగా ప్రస్తుతం ఈ నిరసన కార్యక్రమం కొనసాగడం విశేషం.

**అరెస్టు చేసే దీక్ష చేస్తాం : సోనమ్ వాంగ్‌చుక్**

ప్రముఖ సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ ఈ ఉద్యమానికి మద్దతు ప్రకటించారు. దిప్పేను అరెస్టు చేస్తే తాను ఆరు వారాలపాటు నిరాహార దీక్ష చేపడతానని తెలిపారు. నిరసనలో పాల్గొనే యువత శాంతియుతంగా వ్యవహరించాలని, అతి కారులతో సహకరించాలని సూచించారు. నీటి సీసాలు, మొబైల్ ఫోన్లు వంటి అనవసరమైన వస్తువులనే వెంట తీసుకురావాలని చెప్పారు. పూలు తీసుకురావాలని కూడా ప్రోత్సహించారు. అలాగే ఎవరైనా ఆయుధాలు లేదా అనుమానాస్పద వస్తువులు తీసుకువస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

**భారీగా పోలీసుల మోహరింపు**

నిరసన నేపథ్యంలో జాతీయ రాజధాని ఢిల్లీలో భద్రతను కట్టుదిట్టం చేశారు. జంతర్ మంతర్ పరిసరాలతో పాటు ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం సహా నగరము ప్రవేశ మార్గాలు, కీలక ప్రాంతాల్లో అదనపు భద్రత సిబ్బందిని మోహరించారు. శాంతి భద్రతలు విఘాతం కలగకుండా వెయ్యి మందికి పైగా పోలీసులను రంగంలోకి దించారు. అయితే పౌరుల నిరసన నిర్వహణకు సంబంధించి అధికారిక అనుమతి అత్యవసరం అందలేదని అధికారులు తెలిపారు. అయినప్పటికీ సామాజిక మాధ్యమాల పర్యవేక్షణతో పాటు ఇతర సమాచారం ఆధారాలపై ముందస్తు జాగ్రత్తలు చేపట్టినట్లు 3

# కోడింగ్‌లో.. భారత్ భేష్


మొదటి తరువాయి

ఆయా దేశాల బలమని పేర్కొన్నారు.

**మోదీ నాయకత్వంలో వేగంగా అభివృద్ధి..**

ప్రధాని మోదీ నాయకత్వంలో భారత్ ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని పుతిన్ కొనియాడారు. ఇది రాత్రికి రాత్రి వచ్చిందని కాదు, మోదీ ప్రభుత్వ కష్టానికి నిదర్శనమని చెప్పారు. ప్రస్తుతం ఇరు దేశాల మధ్య ఉన్న 60 బిలియన్ డాలర్ల ద్వైపాక్షిక వాణిజ్యాన్ని త్వరలోనే 100 బిలియన్ డాలర్లకు పెంచడానికి రష్యా కట్టుబడి ఉందని.. క్లీన్ ఎనర్జీ, ఫార్మా, హైడ్రోకార్బన్ రంగాలు ఈ వృద్ధికి దోహదం చేస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

## ప్లాస్టిక్ కరెన్సీని పరిశీలిస్తున్నాం.. ఆర్బీఐ గవర్నర్



**న్యూఢిల్లీ:**
పాలిమర్ లేదా ప్లాస్టిక్ కరెన్సీ నోట్లను ప్రవేశపెట్టే ప్రతిపాదనను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్బీఐ) పరిశీలిస్తున్నదని ఆ బ్యాంక్ గవర్నర్ సంజయ్ మల్హోత్రా శనివారం తెలిపారు. 'మేము దీని లాభనష్టాలు, అమలు చేయడం ప్రయోజనకరంగా ఉంటుందా లేదా అనే విషయాన్ని పరిశీలిస్తున్నాం' అని ఆయన చెప్పారు. పాలిమర్ నోట్లకు సంబంధించి వచ్చిన వార్తల్లో వాస్తవం ఉన్నదని, అయితే కేంద్ర బ్యాంకు దీనిపై నిర్ణయానికి రాలేదని అన్నారు. కొన్ని ప్రాంతాల్లో నగదు కొరత ఏర్పడిందని వార్తలు వచ్చిన నేపథ్యంలో బ్యాంకింగ్ వ్యవస్థ అంతటా పంపిణీకి తగినంత నగదు అందుబాటులో ఉన్నదని స్పష్టం చేశారు. స్థానికంగా ఎక్కడైనా కొరత ఏర్పడితే త్వరగా స్పందించడానికి కేంద్ర బ్యాంకు సిద్ధంగా ఉన్నదని తెలిపారు.

# పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధ మేఘాలు

మొదటి తరువాయి

ఆత్మరక్షణ చర్యల్లో భాగంగానే జలసంధిలోని ఒక ద్వీపంతో పాటు ఇరాన్ తీరంలోని కీలక రాడార్ సైట్‌లపై తాము దాడులు చేసినట్లు సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది. మరోవైపు, ప్రపంచ ఇంధన సరఫరాకు గుండెకాయ లాంటి హోర్ముజ్ జలసంధిపై పట్టు సాధించేందుకు ఇరాన్ ప్రయత్నిస్తుండగా, అందుకు ప్రతిగా అమెరికా ఇరాన్ రేవులపై ఆంక్షలు, దిగ్బంధనాన్ని విధిస్తోంది. ఈ వారంలోనే కువైట్ ప్రధాన విమానాశ్రయంలోని ప్యాసింజర్ టెర్మినల్‌పై ఇరాన్ డ్రోన్లు దాడి చేశాయి. ఈ ఘటనలో ఒకరు మరణించగా, డజన్ల కొద్దీ ప్రయాణికులు గాయపడ్డారు. దీనివల్ల ఎయిర్‌ఫీల్డ్ తాత్కాలికంగా మూతపడింది. ఈ దాడితో తీవ్ర ఆగ్రహానికి గురైన అమెరికా, తాజా ఘర్షణతో ఇరాన్‌కు గట్టి హెచ్చరికలు పంపింది. రాడార్ సైట్‌లపై దాడులతో పాటు, హిందూ మహాసముద్రంలో ప్రయాణిస్తున్న ఇరాన్ లింక్డ్ చమురు ట్యాంకర్‌ను అమెరికా సైన్యం తమ ఆధీనంలోకి తీసుకుంది. ఆంక్షల పరిధిలో ఉన్న చమురును విక్రయించడం ద్వారా ఇరాన్ లాభపడకుండా అడ్డుకునేందుకు అమెరికా ఈ చర్య చేపట్టింది. అలాగే, ఇరాన్ ఇంధన రంగానికి సహాయం చేస్తున్న పలువురు వ్యక్తులు, సంస్థలు, ట్యాంకర్లపై అమెరికా కొత్తగా మరికొన్ని ఆర్థిక ఆంక్షలను విధించింది. ఇరాన్-అమెరికా ఘర్షణ కేవలం జలసంధికే పరిమితం కాలేదు. అమెరికా మధ్యవర్తిత్వంతో ఇజ్రాయెల్, లెబనాన్ ప్రభుత్వాల మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఇరాన్ మద్దతున్న హెజ్‌బొల్లా ఉగ్రవాద సంస్థ తిరస్కరించింది. ఈ క్రమంలో శుక్రవారం ఇజ్రాయెల్ సైన్యం దక్షిణ లెబనాన్‌లోని పలు ప్రాంతాలపై బాంబుల వర్షం కురిపించింది. ఈ దాడుల్లో 9 మంది ప్రాణాలు కోల్పోయారు. దక్షిణ లెబనాన్‌లోని ఎక్కువ భాగాన్ని ఇజ్రాయెల్ ఇప్పటికే తన ఆధీనంలోకి తెచ్చుకుంది. మరోవైపు, హోర్ముజ్ జలసంధి తెరవాలన్నా, శాశ్వత కాల్పుల విరమణ కుదరాలన్నా లెబనాన్‌లో ఇజ్రాయెల్ దాడులు ఆగాలని ఇరాన్ పట్టుబడుతోంది.

## సంపాదకీయం

# అడ్డం తిరిగిన ఆవు




చిన్నప్పుడు పాఠశాలలో ఆవు వ్యాసం రాయించేవారు. అంటే ఆవును వర్ణించాలి. ఆవుకు నాలుగు కాళ్లు, రెండు చెవులు, రెండు కొమ్ములు, ఒక తోక ఉండును. గడ్డి తింటుంది. పాలు ఇస్తుంది, ఇలా సాగేది. ఆ తర్వాత ఆవు వ్యాసానికి బదులు పరీక్షలో విమానం గురించి రాయమంటే, విద్యార్థికి దాని గురించి తెలియక, విమానం ఆకాశంలో ఎగురుతుంది. దాని కిటికీ నుండి చూస్తే పచ్చని మైదానాలు కనిపిస్తాయి. అక్కడ ఆవులు మేత మేస్తుంటాయి. అవి తెల్లగా ఉంటాయని... ఇక వాడికొచ్చిన ఆవు వ్యాసం రాసేస్తాడు. ఇప్పుడు సంఘ్ పరివార్, బీజేపీలది అదే మాదిరి తయారయింది. ఒకటే మూసపోసినట్లు నినాదాలిచ్చి, ప్రజల మధ్య చిచ్చు పెట్టేందుకు పూనుకుంటున్నారు. కానీ కథ ఇప్పుడు అడ్డం తిరిగింది. ఇంత కాలం, ఆవు పవిత్ర దేవత అని, హిందువుల ఆరాధ్యమని, గోమాత అని, ఏ మాంసమున్నా గోమాంస మేనని ముస్లింలపై దాడులు, చంపడాలు చేశారు. అక్లాక్ ను అలానే గోమాంసం ఇంట్లో ఉందని చంపారు. గోవుల రవాణా చేస్తున్న ట్రక్కులను అడ్డగించి డ్రైవర్లను కొట్టి చంపారు. గోవును హిందూ ముస్లింల మధ్య తగాదాగా సృష్టించేందుకు ఒక ప్రచార ఆందోళన చేశారు. మొన్న బక్రీద్ పండుగ సందర్భంగా ముస్లిం పెద్దలే, వారి సమూహాలకు పిలుపునిచ్చారు. బక్రీద్ సందర్భంగా గోవులను వధించవద్దని, హిందువులు దానిని పవిత్రంగా భావించి పూజిస్తారు కనుక ఈ నిర్ణయం చేశామన్నారు. కొనటం, అమ్మటంలో కూడా పాల్గొనవద్దని పిలుపునిచ్చారు. వారు చెప్పినట్లుగానే ముస్లింలు గోవధ మానేశారు. అంతేకాదు, కొనటమూ మానేశారు. అయితే గోవులను పెంచి అమ్ముతున్నవాళ్లు ఎక్కువగా హిందువులే ఉన్నారు. వట్టిపోయిన ఆవులను కూడా కొనటానికి ఎవరూ లేక, కలకత్తాలో పెద్ద ఆందోళనకే దిగారు ఆ అమ్మకందారులు. నూతన ముఖ్యమంత్రి గోవుల కొనుగోళ్లపై నిషేధం, వధ నిషేధం విధించాడని తెలిసి, సువేందు అధికారికి వ్యతిరేకంగా హిందువులే ధర్నాలు చేశారు. మా బతుకుదెరువు పోయిందని, ఆర్థిక పరిస్థితి దయనీయంగా మారిందని లబోదిబోమన్నారు. ఉత్తరప్రదేశ్ లోనూ ఇదే పరిస్థితి కొనసాగింది. గోమాంసాన్ని, బీఫ్ ఎగుమతి చేస్తున్న పెద్ద పెద్ద కంపెనీలు ఉత్తరప్రదేశ్ లోనే ఎక్కువగా ఉన్నాయి. అందులో టాప్ పన్నెండు కంపెనీల యజమానులు ముస్లింలే కాదు. అందరూ హిందువులే! కొన్ని వందల కోట్ల, వేలకోట్ల రూపాయల వ్యాపారం జరుగుతుంటుంది. ఇప్పుడు సీన్ రివర్స్ అయింది. బీఫ్ కంపెనీల దగ్గర కోట్లాది రూపాయలు చందాలు తీసుకున్న బీజేపీ వాళ్లు ఏమీ మాట్లాడలేక పోయారు. ముస్లిం పెద్దలు ఆవును జాతీయ జంతువుగా ప్రకటించి, గోవధను నిషేధించమని కోరారు. ఈ డిమాండ్ పెద్ద ఎత్తున ప్రచారంలోకి తెచ్చారు. ఇక బీజేపీ ప్రభుత్వానికి గొంతులో వెలక్కాయ పడ్డట్లయింది. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, బెంగాల్ ప్రాంతాల్లో పనికి రావనుకున్న ఆవులను కొనేవారు లేక, వాటిని సంరక్షించే స్తోమత లేక, ఎండకు ఎండి చనిపోయిన ఆవులు ఎన్నో సోషల్‌మీడియాలో వార్తలుగా వచ్చాయి. ఏం చేయాలో అర్థం కాని యోగులు, బెంగాల్ మంత్రులు ఒక ఉపాయాన్ని కనిపెట్టారు. పద్నాలుగేండ్ల వయసు దాటాక గోవులను వధించవచ్చని, సర్టిఫికేట్ తీసుకుని అమ్మకాలు, కొనుగోళ్లు చేపట్టవచ్చని సెలవిచ్చారు. అదేమిటి? గోవు మాత అయినప్పుడు, పూజించే గోవు వయసును బట్టి పూజించడం, లేదా వధించడం నిర్ణయిస్తారా? అంటే ముసలాళ్లయిన తల్లిదండ్రులనూ బయటకి గెంటేయటమేనా? "ఆవుతో మాది జన్మజన్మల బంధం, గోమాతను పూజిస్తాము. ఆవు మాకు తల్లి లాంటిది. దీన్ని ప్రకటించాల్సిన అవసరం లేదు" అని యోగి సన్నాయి నొక్కులు నొక్కారు. మరి గోవధను నిషేధించమంటే, ఉలుకూ లేదు, పలుకూ లేదు. "ఆవును జాతీయ జంతువుగా ప్రకటించాలని కానీ, దేశవ్యాప్తంగా గోవధను నిషేధించాలని కానీ ఎలాంటి ప్రతిపాదన లేదు" అని కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ ప్రకటించారు. ఇది వీరి అసలు రూపం. గోవును రక్షించాలన్న కోరిక వీరికి అసలే లేదు. గోవుపై భక్తి అలా ఉంచి ప్రేమ, దయ అసలే లేదు. వీరి నాటకాలన్నీ చందాలు పోగేసుకోవటమే కానీ, గోవు పేరు చెప్పి మతతత్వాన్ని పెంచి మనుషులను విభజించి, రాజకీయ ప్రయోజనం పొందటమే అనేది సుస్పష్టం. మొదటి నుండి గోవు హిందువులకు, మరీ బ్రాహ్మణులకు పవిత్రమైనదని, దానిని గతంలో వధించలేదని, ఆవు మాంసం తినలేదని ఫోజులు పెట్టి చెబుతుంటారు. చాలామంది నమ్ముతారు. అదంతా ఒట్టి భ్రమ. మనుస్మృతి, రుగ్వేదం, బృహదారణ్యకోపనిషత్తులు చదివినా, ప్రముఖుల రాతలు చదివినా అసలు విషయాలు తేటతెల్లమవుతాయి. యజ్ఞం చేస్తున్న వాళ్లు అతిథులకు సోమరసాన్ని, ఎద్దు మాంసాన్ని వండించి పెట్టాలని ఉంది. ప్రసిద్ధ భారతీయ తాత్వికుడు స్వామి వివేకానంద రచనలలో "ఒకప్పుడు భారతదేశంలో గోమాంస భక్షణ చేయని బ్రాహ్మణుడు బ్రాహ్మణుడే కాదు"అని చెప్పారు. చరిత్ర తిరగేస్తే అనేక వాస్తవ విషయాలు బయట పడతాయి. చరిత్రను కూడా వక్రీకరించడం, మతోన్మాదాన్ని సృష్టించడం, దాని ద్వారా రాజకీయ ప్రయోజనాన్ని పొందడమే ఈ కాషాయుల అసలు లక్ష్యం.

# ఆదర్శ కమ్యూనిస్టు కామ్రేడ్ వంగరి సత్తయ్య

**-సంతాప సభలో విప్లవ జోహార్లు**




**నల్లగొండ, జూన్ 6( మహాప్రభ )**
చర్లపల్లి మాజీ సర్పంచ్, మాజీ వైస్ ఎంపీపీ, సిపిఎం సీనియర్ నాయకుడు కామ్రేడ్ వంగరి సత్తయ్య స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని సిపిఎం మాజీ కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి పేర్కొన్నారు. శనివారం నల్గొండ పట్టణంలోని ఎన్ఆర్ఎస్ గార్డెన్లో జరిగిన సంతాప సభలో వారు మాట్లాడుతూ, "నిజాయితీగా, కడవరకు కమ్యూనిస్టుగా జీవించిన వ్యక్తి కామ్రేడ్ సత్తయ్య. ఎర్రజెండాను వీడకుండా పేదలకు వెలుగులు నింపిన గొప్ప నాయకుడు" అని కొనియాడారు. గ్రామ అభివృద్ధి కోసం సర్పంచ్‌గా, ఎంపీటీసీగా చేసిన సేవలను గుర్తుచేశారు. సత్తయ్య సతీమణి పార్వతమ్మ కమ్యూనిస్టు కార్యకర్తలకు అన్నం వండి పెట్టిన త్యాగాన్ని, కుమారుడు వంగరి రమేష్ తండ్రి ఆశయబాటలో నడవాలని సూచించారు. సభ ప్రారంభానికి ముందు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, రెండు నిమిషాల మౌనం పాటించి విప్లవ జోహార్లు అర్పించారు. సిపిఎం పట్టణ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య అధ్యక్షతన జరిగిన ఈ సభలో జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, జిల్లా నాయకులు సయ్యద్ హాశం, ఊట్కూరి నారాయణరెడ్డి, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి గంజి మురళీధర్, కార్పొరేటర్ దొడ్డి రమేష్, ఎల్‌పిటి మార్కెట్ చైర్మన్ జిల్లా బిక్షం, మాజీ జడ్పీటీసీ నామిని గోపాల్, శాఖ కార్యదర్శి పిన్నపురెడ్డి మధుసూదన్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ రాపోలు జయలక్ష్మి రవీందర్, మాజీ సర్పంచ్ ఎన్న నర్సిరెడ్డి, మాజీ కౌన్సిలర్ అవుట రవీందర్, ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షుడు నాంపల్లి చంద్రమౌళి, కుటుంబ సభ్యులు జయలక్ష్మి, కుమార్తెలు గంజి భాగ్యవతి--గోపాల్, తాటి పద్మావతి, తిరందాస్ ధనలక్ష్మి, అలాగే పట్టణ కమిటీ సభ్యులు గుండాల నరేష్, అద్దంకి నరసింహ, కన్నేకంటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# చర్లగౌరారం లో ఘనంగా బాల పంచాయితీ

**-ముఖ్య అతిథులుగా టీజీపీఏ డైరెక్టర్ అభిలాష బిష్త్ ఐపీఎస్ ,జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్, ఎస్పీ శరత్ చంద్ర పవార్**






**కనగల్ ,జూన్ 6( మహాప్రభ )**
నల్లగొండ జిల్లా కనగల్ మండలం చెర్లగౌరారం గ్రామంలో జిల్లా పోలీస్ శాఖ, యాంటి హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'బాల పంచాయతీ' కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది. పిల్లల్లో నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత, సమస్యల పరిష్కార నైపుణ్యాలను పెంపొందించడమే లక్ష్యంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి టీజీపీఏ డైరెక్టర్ అభిలాషా బిష్త్, కలెక్టర్ చంద్రశేఖర్, ఎస్పీ శరత్ చంద్ర పవార్ ముఖ్య అతిథులుగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు పాఠశాలల్లో మౌలిక వసతులు, పరిశుభ్రత, బాలల భద్రత, గ్రామాభివృద్ధి వంటి పలు సమస్యలపై తమ అభిప్రాయాలను అధికారుల ముందు ధైర్యంగా వ్యక్తపరిచారు. అతిథులు మాట్లాడుతూ పిల్లల రక్షణ కుటుంబం నుంచే ప్రారంభమవుతుందని, ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లల ఆలోచనలను ప్రోత్సహించాలని సూచించారు. గ్రామస్థాయి నుంచే పిల్లలకు ప్రజాస్వామ్యంపై అవగాహన కల్పించి, వారిని భాగస్వాములను చేయడం ద్వారా సమాజంలో సానుకూల మార్పు తీసుకురావచ్చని అభిప్రాయపడ్డారు వేరే దేశ భవిష్యత్తు వారి ఆలోచనలు ప్రాధాన్యం ఇవ్వాలని బాలల భద్రత, విద్య, మానసిక అభివృద్ధి కోసం జిల్లా పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తోందని ఎస్పీ స్పష్టం చేశారు. కార్యక్రమంలో యంగిస్థాన్, ఆశ్రిత ఎన్జీఓ ప్రతినిధులు పాల్గొని బాలల హక్కులు, సురక్షిత బాల్యంపై చిన్నారులకు అవగాహన కల్పించారు బాలల సాధికారిక గ్రామీణ వేదిక కార్ నిలిచిన ఈ కార్యక్రమంలో మూడు వందలకు పైగా గ్రామస్తులు మహిళా సంఘాల ప్రతివీధులు యువత పాల్గొని విజయవంతం చేశారు ఈ కార్యక్రమంలో ఏఎస్పీ రమేష్, డీఎస్పీ శివరాం రెడ్డి, ఎంపీడీఓ వేద రక్షిత, సీఐలు, ఆదిరెడ్డి రాము కరుణాకర్ ఎస్ఐలు, రాజీవ్ రెడ్డి అంజలి. జిల్లా విద్యాధికారి సుసింధర్ రావు సిడబ్ల్యుసి చైర్మన్ కృష్ణయ్య స్థానిక ప్రజాప్రతినిధులు, రాజు రెడ్డి ఉపాధ్యాయులు మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ--ప్రైవేట్ కళాశాలల సమస్యల

# పరిష్కారానికి ఏబీవీపీ డిమాండ్

**-వినతిపత్రం అందజేసిన జిల్లా కన్వీనర్ మొక్తాల శాంతన్**




**నాగర్‌కర్నూల్, జూన్ 6( మహాప్రభ )**
నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి (డీఐఈవో వెంకట్ రమణ)కు జూనియర్ కళాశాలల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ మొక్తాల శాంతన్ మాట్లాడుతూ, "ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో కనీస మౌలిక వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తరగతి గదులు, తాగునీరు, మరుగుదొడ్లు, ల్యాబ్ సదుపాయాలు లేక విద్యాభ్యాసం దెబ్బతింటోంది. గ్రామీణ ప్రాంతాల విద్యార్థుల కోసం హాస్టల్ వసతి కల్పించాలి" అని డిమాండ్ చేశారు. అలాగే ఖాళీగా ఉన్న బోధన సిబ్బంది పోస్టులను వెంటనే భర్తీ చేసి నాణ్యమైన విద్య అందించాలన్నారు. ప్రైవేట్ కళాశాలలు విద్యను వ్యాపారంగా మార్చి అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థులు, తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపుతున్నాయని విమర్శించారు. "ప్రభుత్వ నిబంధనలను పాటించకుండా, సరైన అనుమతులు లేకుండా కొన్ని కళాశాలలు నడుస్తున్నాయి. కనీస మౌలిక వసతులు లేకుండా విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్నారు. మెటీరియల్స్, ప్రత్యేక కోచింగ్ పేర్లతో వేలాది రూపాయలు అదనంగా వసూలు చేస్తున్నారు" అని శాంతన్ ఆరోపించారు. సంబంధిత అధికారులు వెంటనే తనిఖీలు నిర్వహించి నిబంధనలకు విరుద్ధంగా పనిచేస్తున్న కళాశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని, అధిక ఫీజుల వసూళ్లను అరికట్టి విద్యార్థుల హక్కులను పరిరక్షించాలని ఏబీవీపీ డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి ప్రసాద్ కుమార్, శివ, నితీష్, మల్లేష్, విష్ణు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# నాటుసారా రహిత సమాజమే లక్ష్యం

**-నందికొట్కూరులో ప్రత్యేక అవగాహన సమావేశం**



**నందికొట్కూరు, డివిజన్ 06 ( మహాప్రభ )**
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన "నవోదయం 2.0" కార్యక్రమంలో భాగంగా, జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా ఆదేశాల మేరకు, జిల్లా ప్రోహిబిషన్ & ఎక్సైజ్ అధికారి సాదు రవికుమార్ సూచనలతో నందికొట్కూరు పట్టణంలోని నీలి షికారి పేటలో శనివారం ప్రత్యేక అవగాహన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, "నాటుసారా వల్ల ఆరోగ్య సమస్యలు, కుటుంబాల పతనం జరుగుతుంది. ఈ వృత్తిని మానుకుని గౌరవప్రదమైన జీవితం సాగించాలి" అని పిలుపునిచ్చారు. నాటుసారా తయారీని పూర్తిగా మానుకునే కుటుంబాలకు ప్రభుత్వం తరఫున రూ.15,000 ఆర్థిక సహాయం అందించి, కిరాణా దుకాణాలు, కూరగాయల వ్యాపారం, గొర్రెల పెంపకం, బర్రెల పెంపకం వంటి స్వయం ఉపాధి మార్గాలను కల్పిస్తామని హామీ ఇచ్చారు. యువతకు డీఆర్డీఏ/ఉపాధి హామీ పథకం ద్వారా డ్రైవింగ్, టైలరింగ్, కంప్యూటర్స్ వంటి కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. పిల్లల చదువుల కోసం గురుకుల పాఠశాలల్లో సీట్లు, పోటీ పరీక్షల మెటీరియల్స్ అందిస్తామని, అలాగే రేషన్ కార్డులు, పెన్షన్లు, పక్కా గృహాలు, ఉచిత వైద్య సదుపాయాలు కల్పిస్తామని స్పష్టం చేశారు. "ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఇకపై కూడా నాటుసారా వ్యాపారం కొనసాగిస్తే కఠిన చర్యలు తప్పవు" అని అధికారులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా డ్వామా డీడీఓ శ్రీనివాసులు, అర్బన్ సీఐ అశోక్, ఎస్ఐ చంద్రశేఖర్, ఎక్సైజ్ సీఐ రామాంజనేయులు, ఎస్ఐలు జఫరుల్లాహ్, భాష్యం శ్రీనివాసులు, మెప్మా విభాగం అర్చన తదితరులు పాల్గొన్నారు.

# కోట్ల జతిన్ గారి మృతి అత్యంత బాధాకరం

**-ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్**



**దేవరకొండ డివిజన్ 06 ( మహాప్రభ )**
కొండమల్లేపల్లి మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు కోట్ల జగదీశ్ గారి కుమారుడు కోట్ల జతిన్ (13) గుండెపోటుతో మరణించిన విషయం తెలుసుకొని వారి స్వగృహానికి వచ్చి చిన్నారి మృతదేహానికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉన్నారు చతిన్ గారి మృతి అత్యంత బాధాకరణమని వారి యొక్క కుటుంబ సభ్యులను పరామర్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నాయిని జమున మాధవ రెడ్డి నల్లగొండ పార్లమెంట్ కో ఆర్డినేటర్ ఎం ఏ సిరాజ్ ఖాన్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఉట్కూరి వేమన్ రెడ్డి మాజీ ఎంపిపి మేకల శ్రీనివాస్ యాదవ్ మాజీ వైస్ ఎంపిపి కాసర్ల వెంకటేశ్వర్లు మరియు ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 11వ వార్డులో ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమం లో పాల్గొన్న చైర్ పర్సన్ పున్న శైలజ వెంకటేష్



**దేవరకొండ జూన్ 6( మహాప్రభ )**
తెలంగాణ ప్రభుత్వం మున్సిపల్ పరిపాలన మరియు పట్టణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక (99 రోజుల కార్యాచరణ ప్రణాళిక) కార్యక్రమంలో భాగంగా దేవరకొండ మున్సిపాలిటీ 11వ వార్డులో వార్డు సభ నిర్వహించారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పున్న శైలజ వెంకటేష్ , 11వ వార్డు కౌన్సిలర్ ఎస్.కే. నవీద్ పాల్గొని వార్డు అభివృద్ధికి సంబంధించిన అంశాలపై ప్రజలతో చర్చించారు. ఈ సందర్భంగా పట్టణ పరిశుభ్రత, డ్రైనేజీ శుభ్రపరచడం, ఎస్ డబ్ల్యూ ఎం -2026 నిబంధనల అమలు, ప్లాస్టిక్ నిషేధం, వర్షపు నీటి సంరక్షణ నిర్మాణాలు ( ఆర్డబ్ల్యూహెచ్ ), త్రాగునీటి సదుపాయాలు, గుంతల పూడ్చివేత, మొక్కలు నాటడం మరియు సంరక్షణ, వీధి దీపాల ఏర్పాటు వంటి అంశాలపై అవగాహన కల్పించి ప్రజల సూచనలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ సయ్యద్ దస్తగిర్, మున్సిపల్ కమిషనర్ ఎం. రామదుర్గ రెడ్డి,సానిటరీ ఇన్స్పెక్టర్ శంకర్ , టీపీఓ వర్షిత , వార్డు ఆఫీసర్ నజీర్, ఆర్‌పీ హేమలత, అంగన్వాడీ టీచర్ పద్మా తదితర అధికారులు పాల్గొన్నారు. అలాగే వార్డు నాయకులు మొహమ్మద్ సాదిక్, కామోజీ మురళి, శ్రీను, బాలయ్య, మొహమ్మద్ ఇలియాజ్, మొహమ్మద్ గౌస్, వెంకటేష్, రమణ, నర్సమ్మ, నజియా బేగం మరియు వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ధాన్యం చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం..

**-జిల్లా వ్యాప్తంగా 80,391 మంది రైతుల నుంచి 3,67,685,080 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి,62,363 మంది రైతుల అకౌంట్లో 664,67 కోట్ల రూపాయలు చెల్లింపులు పూర్తి.**

**-జిల్లా వ్యాప్తంగా 256 కొనుగోలు కేంద్రాలు మూసివేత**

**-జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**



**మెదక్ జిల్లా -06జూన్ (మహాప్రభ )**
ధాన్యం చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. జిల్లా వ్యాప్తంగా 80,391 మంది రైతుల నుంచి 3,67,685,080 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి,62,363 మంది రైతుల అకౌంట్లో 664,67 కోట్ల రూపాయలు చెల్లింపు చేశామన్నారు.జిల్లా వ్యాప్తంగా 256 కొనుగోలు కేంద్రాలు మూసివేసినట్లు శని వారం ఒక ప్రకటన తెలిపారు. రైతులు అధైర్య పడొద్దు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు.

# పట్టణ పరిశుభ్రత,ప్రజా సమస్యల పరిష్కారానికై వార్డు సభ

**అచ్చంపేట, -06జూన్ (మహాప్రభ )**
నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలో శాసనసభ్యుడు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్ మురళి ఆధ్వర్యంలో 20, 12వ వార్డుల్లో వార్డు సభలు నిర్వహించారు.పచ్చదనం, పరిశుభ్రత, నీటి సంరక్షణ, ఇంకుడు గుంతలు, ఘన వ్యర్థాల నివారణతో పాటు వార్డుల్లో ఉన్న సమస్యలపై ఈ సభలో చర్చ జరిగింది. ఈ కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ మురళి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఖాదర్ పాషా, మాజీ కౌన్సిలర్లు రమేష్ రావు, ఖాజాబీ, వార్డు ఇన్‌చార్జి లక్ష్మణ్ బాబు, కో-ఆప్షన్ సభ్యురాలు షమీం, వార్డు ఆఫీసర్ గణేష్, ఆశా వర్కర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. పట్టణ పరిశుభ్రత, ప్రజా సమస్యల పరిష్కారానికి వార్డు సభలు ఉపయోగకరమని అధికారులు పేర్కొన్నారు.

# శ్రీ శ్రీ కనకదుర్గ ఆలయాన్ని దర్శించుటకు ఆహ్వానించిన ఆలయ కమిటీ సభ్యులు



**దేవరకొండ డివిజన్ 06 ( మహాప్రభ )**
నిర్మాణ దశలో ఉన్న శ్రీ శ్రీ కనక దుర్గా ఆలయానీ దర్శించుకావా3 ల్సిందిగా బి ఆర్ ఎస్ పార్టీ దేవరకొండ నియోజకవర్గ నాయకులు వడ్త్య రమేష్ గారిని ఆహ్వానిచ్చిన ఆలయ నిర్మాణ కమిటి సభ్యులు చింతపల్లి మండలం కేంద్రాల్లో నూతనంగా నిర్మించిన ఆలయంలో నిర్మాణ దశలో ఉన్న శ్రీ శ్రీ కనక దుర్గా ఆలయానీ దర్శించుకావాల్సిందిగా తమ నివాసం దేవరకొండలో బి ఆర్ ఎస్ పార్టీ దేవరకొండ నియోజకవర్గ నాయకులు వడ్త్య రమేష్ గారిని ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానించారు అనంతరం వారిని కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించారు ఈ కార్యక్రమంలో నాయకులు చింతపల్లి మాజీ సర్పంచ్ నట్వ గిరి , కమిటీ చైర్మన్ కొరకొండ నారాయణ గుప్తా, కార్యదర్శి ఉరుకొండ యాదయ్య, ఉప అధ్యక్షుడు వలసాని సత్యనారయణ, పాల్గొన్నారు...

# జైపాల్ నాయక్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న కేతావత్ భిల్యా నాయక్



**దేవరకొండ డివిజన్ జూన్ 06 ( మహా ప్రభ )**
చింతపల్లి మండల పరిధిలోని బోటిమిది తండా కు చెందిన బీల్యా నాయక్ ప్రియ శిష్యుడు జైపాల్ నాయక్ జన్మదినం సందర్భంగా కేక్ కటింగ్ కార్యక్రమంలో పాల్గొన్న బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కేతావత్ భిల్యా నాయక్ గారు.అనంతరం నిండు నూరేళ్లు సంతోషంగా ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో ఆనందంగా మెలగాలని ఆశీర్వదించారు ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ కిషన్ నాయక్,వార్డు సభ్యులు బాస్కర్ నాయక్,సుమన్, గోవిందర్,శివ,వంశి శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు

# గ్రామ గ్రామాల్లో ఓటర్ సవరణలపై తహసిల్దార్ అవగాహన కార్యక్రమం



**రామాయంపేట జూన్ 6 మహాప్రభ**
రామాయపేట మండలంలో ఝాన్సీ లింగాపూర్ కాట్రియాల. సుతర్ పల్లి. గ్రామాల్లో నిర్వహించిన ఓటర్ సవరణలు మ్యాపింగ్ పై. తహసిల్దార్ రజని కుమారి ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు 2002 తర్వాత ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరు ఓటర్ ఐడి మ్యాపింగ్ చేసుకోవాలన్నారు లేనియెడల ఓటర్ ఐడి కార్డ్ కట్ అవుతుందని తెలిపారు

# అనారోగ్యం, నిద్రలేమితో బాధపడుతూ మహిళ ఆత్మహత్య

**తాడ్వాయి జూన్ 6 (మహాప్రభ)**



తాడ్వాయి మండల కేంద్రంలో ఓ వివాహిత మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తాడ్వాయి గ్రామానికి చెందిన స్వాతి (35) తన నివాసంలో ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి బండలమీది రాజమణి (ఐలాపూర్ గ్రామం, లింగంపేట్ మండలం) ఇచ్చిన ఫిర్యాదు మేరకు, స్వాతి గత ఆరు నెలలుగా అనారోగ్యం, నిద్రలేమి సమస్యలతో బాధపడుతూ పలు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నట్లు తెలిసింది. అయితే ఆరోగ్య పరిస్థితి మెరుగుపడకపోవడంతో ఆమె తీవ్ర మానసిక ఆందోళనకు గురైనట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు తెలిపారు. ఘటన స్థలంలో మృతురాలు రాసిన సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అందులో తన ఆరోగ్య సమస్యలు, మానసిక వేదన కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నానని, తన మరణానికి ఎవరూ బాధ్యులు కారని పేర్కొన్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు. మృతురాలి మరణంపై కుటుంబ సభ్యులు ఎలాంటి అనుమానాలు వ్యక్తం చేయలేదని పేర్కొన్నారు. ఈ ఘటనపై తాడ్వాయి ఎస్సై నరేష్, కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

# కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**- న్యాయవాది ఎర్ర కృష్ణ జాంభవ్**




**దేవరకొండ జూన్ 6( మహాప్రభ )**
దేవరకొండ మండలం కొండ భీమనపల్లి గ్రామంలో శంకర నేత్రాలయ వారి సౌజన్యంతో, ఎం.వి.ఆర్ ఫౌండేషన్ మునుకుంట్ల వెంకట్ రెడ్డి, మునుకుంట్ల విద్యావతి మరియు ఎన్‌ఆర్ఐ మునుకుంట్ల తిరుమల్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం నాయకులు, న్యాయవాది ఎర్ర కృష్ణ జాంభవ్ మాట్లాడుతూ గత నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరం ను ప్రజలు పెద్ద ఎత్తున ఈ యొక్క శిబిరన్ని ఉపయోగించుకుంటున్నారని, చుట్టూ ప్రక్కల గ్రామాల, తండాలా ప్రజలు ఈ యొక్క అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారని, ఇలాంటి గొప్ప అవకాశం కల్పించిన ఎం వి ఆర్ ఫౌండేషన్ మునుకుంట్ల వెంకట్ రెడ్డి, మునుకుంట్ల విద్యావతి మరియు ఎన్ ఆర్ ఐ మునుకుంట్ల తిరుమల్ రెడ్డి కు ప్రజల తరుపున ధన్యవాదములు తెపిపారు. అనంతరం వారు శాస్త్రచికిత్స చేసిన వారికీ కాళ్ళ అద్దాలు మరియు వారికీ ఆరోగ్యాపారమైన సూచనలు ఇవ్వడం జరిగింది అని తెలిపారు. అదేవిదంగా ఆదునాతన పరికరాలు తీసుకోచ్చి గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తున్న శంకర నెత్రాలయ సంస్థ కు వారికీ అన్నివిధాలా అండగా ఉన్నా తీర్మల్ రెడ్డి కి ప్రత్యేక ధన్యవాదములు తెలియపారు .ఈ కార్యక్రమంలో వారితోపాటు స్థానిక నాయకులు, సిబ్బంది, మరియు ప్రజలు పాల్గొన్నారు.

# ఎనోక్ బెనర్జీ మృతి మృతదేహానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే బాలు నాయక్



**దేవరకొండ జూన్ 6 (మహా ప్రభ )**
దేవరకొండ పట్టణం 11వ వార్డుకు చెందిన ఎనోక్ బెనర్జీ మృతి బాధాకరమని, వారి యొక్క మృత దేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ నాయక్ అన్నారు.. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ ఎస్.కె. నవీద్, మాజీ కౌన్సిలర్ బత్తుల అమర్, హన్మంత్ వెంకటేష్ గౌడ్, ఎస్.డి. డానియల్, వైఎస్ కర్ణాకర్, ఐ డి ప్రసన్న కుమార్, ఎస్. ఉమా మహేష్, గోగికార్ సురేష్, మొయిన్ పాషా, వస్కుల కృష్ణయ్య, అల్లాఉద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కమిటీ టిపిసిసి ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా కొండ్రపల్లి రమేష్



**దేవరకొండ జూన్ 6 ( మహా ప్రభ )**
నిన్న జరిగిన టిపిసిసి ఎస్సీ సెల్ సంస్థాగత నిర్మాణం (రాష్ట్ర కార్యవర్గం) సమావేశంలో నల్లగొండ జిల్లా డిండి మండలంలోని ప్రతాప్ నగర్ గ్రామానికి చెందిన కొండ్రపల్లి లక్ష్మయ్య భాగ్యమ్మ చిన్న కుమారుడు కొండ్రపల్లి రమేష్ టిపిసిసి ఎస్సీ సెల్ రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా ఎన్నిక కావడం జరిగింది. టిపిసిసి ఎస్సీ సెల్ రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా ఎన్నికైనందున దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలు నాయక్ కొండ్రపల్లి రమేష్ శాలువాతో సన్మానించడం జరిగింది. నాపై నమ్మకంతో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా నియమించిన మానకొండూరు నియోజకవర్గం శాసనసభ్యులు, టిపిసిసి ఎస్సి విభాగం చైర్మన్ డాక్టర్ కొవ్వంపల్లి సత్యనారాయణ , నా నియామకానికి సహకరించిన గౌరవవియులు దేవరకొండ నియోజకవర్గం ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే నా ఎన్నికకు స హకరించిన ప్రతి ఒక్కరికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# కోట్ల జతిన్ కుమార్ మృతి చాలా బాధాకరం

**-మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్**

**రాష్ట్ర నాయకులు కేతావత్ భీల్యానాయక్**



**దేవరకొండ జూన్ 6 (మహా ప్రభ )**
కొండమల్లేపల్లి పట్టణానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కోట్ల జగదీశ్ కుమారుడు కోట్ల జతిన్ కుమార్ నిన్న గుండెపోటు కారణంగా మృతి చెందిన విషయం తెలుసుకున్న మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్, బి ఆర్ఎస్. రాష్ట్ర నాయకులు కేతావత్ భీల్యానాయక్ మృత దేహానికి పూలమాల వేసి నివాళు లర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు ఆయన వెంట సినియర్ నాయకులు కేసాని లింగారెడ్డి, గాజుల రాజేష్ , రమావత్ రమేష్, వెంకటేష్ , తోట పల్లి శ్రీను, బోడ శ్రీను , నేనావత్ నాగార్జున ,దేవావత్ నిరంజన్ తదితరులు ఉన్నారు.

## కన్కల్ గ్రామంలో గ్రామసభ నిర్వహణ
## అభివృద్ధి, ఆరోగ్యం, విద్యపై విస్తృత చర్చ



**తాడ్వాయి జూన్ 6(మహాప్రభ)**
కన్కల్ గ్రామంలో శనివారం గ్రామసభ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రామాభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై అవగాహన కల్పించడంతో పాటు ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్నారు. గ్రామసభలో ప్రజారోగ్యం, బడిబాట కార్యక్రమం, పశువులకు టీకాల ప్రాముఖ్యత, పరిశుభ్రత, విద్యాభివృద్ధి వంటి అంశాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామ ప్రజలు తమ పిల్లలను తప్పనిసరిగా పాఠశాలలకు పంపించాలని, ఆరోగ్య పరిరక్షణ విషయంలో అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మైలారం రవీందర్ రెడ్డి, మాట్లాడుతూ గ్రామాభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. గ్రామంలో చేపడుతున్న అభివృద్ధి పనులు, ఇందిరమ్మ ఇండ్ల పురోగతి, భవిష్యత్తులో చేపట్టనున్న కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సెక్రెటరీ విక్రాంత్ సింగ్, ఉపసర్పంచ్ చాకలి మహేష్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, ప్రభుత్వ పాఠశాల యాజమాన్యం, మండల స్థాయి అధికారులు, పోలీసు శాఖ ప్రతినిధులు పాల్గొని తమ తమ శాఖలకు సంబంధించిన అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామాభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంలో గ్రామసభల పాత్ర ఎంతో కీలకమని వారు పేర్కొన్నారు. గ్రామ ప్రజలు కూడా తమ సమస్యలు, అవసరాలను సభ దృష్టికి తీసుకువచ్చారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు. గ్రామసభలో ప్రజల నుంచి మంచి స్పందన లభించగా, గ్రామాభివృద్ధికి అందరూ సహకరించాలని నాయకులు పిలుపునిచ్చారు.

## రైతుల సమస్య పరిష్కరించాల్సిన ప్రతినిధులే రోడ్డుపై ధర్నాకు కూర్చోవడంమా?

**- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతులు**



**రామాయంపేట జూన్ 6 మహాప్రభ**
రైతుల సమస్యలు పరిష్కరించాల్సిన పిఎసిఎస్ చైర్మన్ లే రోడ్డుపై కూర్చొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలంటూ రామాయంపేట పిఎసిఎస్ చైర్మన్ బాదే.చంద్రం ధర్నాకు దిగడంపై రైతులు ముక్కున వేలు వేసుకున్నారు. మెదక్ జిల్లా రామాయంపేట మండలం రాయలపూర్ గ్రామంలో తడిసిన ధాన్యాన్ని కొనాలని డిమాండ్ మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్ రెడ్డి ధర్నాకు కూర్చోగా ఆమెతో కలిసి రామయంపేట సింగిల్ విండో చైర్మన్ ధర్నా చేయడం పట్ల రైతుల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. బాధ్యతాయుత పదవిలో ఉండి రైతుల సమస్యను పరిష్కరించాల్సిన సింగిల్విండో చైర్మన్ ఇలా మాజీ డిప్యూటీ స్పీకర్ తో కలిసి ధర్నాకు కూర్చోవడం పట్ల రైతులు అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత పిఎసిఎస్ చైర్మన్ తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి లారీల కొరత లేకుండా చూసి రైతులకు న్యాయం జరిగేలా చూడాలని ఈ సందర్భంగా రైతులు డిమాండ్ చేశారు.

## విద్య తోనే భవిష్యత్తు

**- జిల్లా ఎస్పీ డి.వి శ్రీనివాసరావు**

**-నాయకత్వ లక్షణాలు పెంపొందాలి**






**పాపన్నపేట, జూన్ 6( మహా ప్రభ)**
విద్యతోనే ఉన్నత భవిష్యత్తు ఉంటుందని జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం పాపన్నపేట లోని ఓ ఫంక్షన్ హాల్ లో పోలీస్ శాఖ,ఉమెన్ సేఫ్టీ వింగ్,మై ఛాయిస్ ఫౌండేషన్,యంగిస్థాన్ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో బాలపంచాయతీ (చిల్డ్రన్ పార్లమెంట్ ) కార్యక్రమం నిర్వహించారు. పాపన్నపేట జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.విద్య,బాల్య వివాహాలు,బాల్య కార్మిక వ్యవస్థ నిర్మూలన,పారిశుద్ధ్యం,త్రాగునీరు బాలల రక్షణ అంశాల పై చర్చించారు. విద్యార్థుల్లో ప్రశ్నించే నాయకత్వ లక్షణాలు పెంపొందించాలని అధికారులకు జిల్లా ఎస్పీ,అదనపు కలెక్టర్ సూచించారు. ఈకార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ నగేష్,డిఎస్పీ ప్రసన్నకుమార్,తహాశీల్దార్ సతీష్ కుమార్,ఎంపీడీఓ విష్ణువర్ధన్,సీఐ లు జార్జి,రాజశేఖర్,ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్,ఎంఈవో ప్రతాప రెడ్డి,పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహేశ్వర్,డీసీపిఓ నాగరాజు,యంగిస్తాన్ ఫౌండేషన్ ప్రతినిధి వృత్తిక,సర్పంచ్ పావని నరేందర్ గౌడ్,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# సమాచార హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి


**- ఆర్టీఐఏఎస్ రాష్ట్ర అధ్యక్షులు డా,, కొర్ర, కిషన్ నాయక్ రాష్ట్రంలో అని జిల్లాలలో ఆర్‌టిఐ జిల్లా మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేయాలి**



డా,, కొర్ర. కిషన్ నాయక్
RTIAS రాష్ట్ర అధ్యక్షులు
ఫోన్ నెం 9885122005

**దేవరకొండ జూన్ 6( మహాప్రభ)**
రైట్ టు ఇన్ఫర్మేషన్ ఆక్టివిస్ట్ సొసైటీ ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టం-2005 బలోపేతం కొరకు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డా,, కొర్ర. కిషన్ నాయక్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం జిల్లా మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేయాలని, ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో (గ్రామపంచాయతీ స్థాయి రాష్ట్ర స్థాయి వరకు) సమాచార బోర్డులు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే సమాచార హక్కు చట్టం సెక్షన్ 4(1)(బి) ప్రకారం స్వచ్ఛందంగా వెల్లడించాల్సిన సమాచారాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచాలని, సెక్షన్ 26 అనేది చాలా కీలకమైనది.ఇది ప్రజలకు సమాచార హక్కుపై అవగాహన కల్పించడానికి మరియు ఈ చట్టాన్ని సమర్థవంతగా అమలు చేయడానికి ప్రభుత్వాలు చేపట్టావాల్సిన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. ముఖ్యంగా సమాచార హక్కు చట్టం దరఖాస్తుదారులు, కార్యకర్తల రక్షణకు సంబంధించిన మెమో నం. 33086ను సమర్థవంతంగా అమలు చేయాలని విన్నవించారు. దరఖాస్తుదారుల వివరాలు బహిర్గతం కాకుండా చూడాలని, వారికి చట్టప్రకారం గడువులోపు సమాచారం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో జిల్లా, డివిజన్, మండల స్థాయిల్లో నిర్వహించే ఆర్‌టిఐ కార్యక్రమాల్లో సొసైటీ సభ్యులను భాగస్వామ్యం చేయాలని కూడా విజ్ఞప్తి చేశారు. ఆర్టీఐ ఆక్టివిస్ట్ సొసైటీ ప్రభుత్వ అధికారులతో సమన్వయంతో నిరంతరం ఆర్‌టిఐ చట్టం అమలుకు కృషి చేస్తుందని తెలిపారు. తమ సొసైటీ ఆధ్వర్యంలో ప్రజలకు సమాచార హక్కు చట్టంపై, భారత రాజ్యాంగ పీఠిక, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల నివారణ, రోడ్ సేఫ్టీ, ప్లాస్టిక్ నివారణ పర్యావరణ పరిరక్షణ, అడవుల సంరక్షణ పై అవగాహన కార్యక్రమాలు , చేపడుతున్నట్లుగా సంక్షిప్తంగా చెప్పాలంటే సెక్షన్ 26 అనేది ఆర్.టి.ఐ(ఆర్టీఐ), చట్టాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడానికి ప్రభుత్వానికి అప్పగించిన ఒక్క బాధ్యత అని కిషన్ నాయక్ చేపిన్నారు.

## శివశంకర్ గౌడ్ కు రాష్ట్ర స్థాయి ఉత్తమ పాత్రికేయ పురస్కారం,






**తూప్రాన్ జూన్ 6,(మహా ప్రభ)**
జాతీయ తెలుగు సారస్వత పరిషత్,తెలుగు భాషా చైతన్య సమితి సంయుక్త ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి దేవస్థానం వద్ద గంగా సదన్ లో శుక్రవారం ఏర్పాటుచేసిన ఉమ్మడి తెలుగు రాష్ట్రాల ఉత్తమ పాత్రికేయ పురస్కార ప్రధానోత్సవ ప్రత్యేక కార్యక్రమం జరిగింది.మెదక్ జిల్లా తూప్రాన్ కు చెందిన సీనియర్ జర్నలిస్ట్,జ్యోతి జాతీయ తెలుగు దినపత్రిక రిపోర్టర్ రామునిగారి శివశంకర్ గౌడ్ కు ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి ఉత్తమ పాత్రికేయ పురస్కారం లభించింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వ్యవహారాల ప్రధాన సలహాదారు మహమ్మద్ అహ్మద్ షరీఫ్, శ్రీకాళహస్తి ఆలయ కమిటీ చైర్మన్ కొట్టే సాయికుమార్ తదితరుల చేతుల మీదుగా ఈ ఉత్తమ జర్నలిస్ట్ పురస్కారం అందజేయడం జరిగింది. తెలంగాణ రాష్ట్రంలో 18 మందిని ఎంపిక చేయగా అందులో మెదక్ జిల్లా నుంచి రామునిగారి శివశంకర్ గౌడ్ కు ఈ అవకాశం దక్కింది.ఉత్తమ పాత్రికేయ పురస్కార ప్రధానోత్సవ కార్యక్రమంలో జ్యోతి దినపత్రిక సంపాదకులు నాంపల్లి శ్రీనివాస్ తోపాటు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన పలువురు కవులు,కళాకారులు పాల్గొన్నారు. దాదాపు 34 సంవత్సరాలుగా పాత్రికేయుడిగా పనిచేస్తూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం అవిశ్రాంతంగా తన వంతు బాధ్యతను నిర్వర్తిస్తూ,సామాజిక సేవా రంగంలో తనకంటూ మంచి గుర్తింపును సంపాదించిన శివశంకర్ గౌడ్ కు ఉత్తమ సేవా పురస్కారం దక్కడం సముచితం, సంతోషకరమని పలువురు ప్రశంసించారు. ఇన్నేళ్లుగా పత్రికా రంగంలో పనిచేస్తూ మంచి రిపోర్టర్ గా రాణిస్తున్న శివశంకర్ గౌడ్ కు రాష్ట్ర స్థాయి ఉత్తమ జర్నలిస్టు అవార్డుతో గొప్ప గుర్తింపు,గౌరవం దక్కడం అభినందనీయమని పేర్కొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో మృతి చేందిన కానిస్టేబుల్

**-మహిపాల్ కుటుంబానికి పోలీసు శాఖ అండగా ఉంటుంది**

**-అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, ఐపీఎస్.**



**మెదక్ జిల్లా,-06జూన్ (మహాప్రభ ).**
నిన్న రాత్రి విధులు ముగించుకొని ఇంటికి వెళ్తున్న సమయంలో శివంపేట్ పోలీస్ స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ మహిపాల్ రోడ్డు ప్రమాదంలో లారీని ఢీకొనడంతో దురదృష్టవశాత్తు మృతి చెందారు. జరిగిన ఈ విషాద ఘటన జిల్లా పోలీసు శాఖను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. మహిపాల్ 2024లో పోలీసు శాఖలో చేరి, సుమారు సంవత్సరం పాటు క్యూఆర్టీ (క్యూ ఆర్ టి )లో విధులు నిర్వహించారు. అనంతరం కొద్ది రోజుల క్రితమే బదిలీపై శివంపేట్ పోలీస్ స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. తన స్వల్ప సేవా కాలంలోనే అంకితభావం, క్రమశిక్షణ, విధి నిర్వహణలో నిబద్ధతతో సహచరుల అభిమానాన్ని సంపాదించారు. విషయం తెలుసుకున్న మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు, ఐపీఎస్ అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించేందుకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మెదక్ జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, ఐపీఎస్ మహిపాల్ స్వగ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులను ఓదార్చి, ఈ క్లిష్ట సమయంలో కుటుంబానికి అన్ని విధాలా అండగా నిలుస్తామని భరోసా కల్పించారు. మహిపాల్ అకాల మరణం పోలీసు శాఖకు తీరని లోటని అధికారులు, సిబ్బంది పేర్కొన్నారు. విధి నిర్వహణలో ఆయన చూపిన కర్తవ్యనిష్ఠను స్మరించుకుంటూ నివాళులర్పించారు. భగవంతుడు ఆయన ఆత్మకు శాంతి చేకూర్చాలని, ఈ తీవ్ర విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని కుటుంబ సభ్యులకు ప్రసాదించాలని ప్రార్థిస్తూ తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

## రామాయంపేట మెదక్ రోడ్ శివారులో ద్విచక్ర వాహనం లారీ డి కానిస్టేబుల్ మృతి

**రామాయంపేట జూన్ 6 మహాప్రభ**
శివంపేట పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న మైపాల్ అనే కానిస్టేబుల్ బైక్ పై వస్తుండగా లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.




## ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట ప్రతిజ్ఞ నిర్వహణ



**తాడ్వాయి జూన్ 6(మహాప్రభ)**
కన్కల్ గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట ప్రతిజ్ఞ, కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం, ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించడం లక్ష్యంగా గ్రామస్తులు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమవంతు సహకారం అందించాలని, విద్యార్థుల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని పిలుపునిచ్చారు. అలాగే ఉపాధ్యాయులు విద్యార్థులకు మెరుగైన బోధన అందించి ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలని సూచించారు. గ్రామంలో విద్యా ప్రమాణాల పెంపు, బడిబాట కార్యక్రమం విజయవంతం, విద్యార్థుల శాతం పెంపు, పాఠశాల మౌలిక వసతుల అభివృద్ధి కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలని గ్రామసభలో తీర్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మైలారం రవీందర్ రెడ్డి, గ్రామ సెక్రెటరీ విక్రాంత్ సింగ్, ఉపసర్పంచ్ చాకలి మహేష్, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా వర్కర్స్, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గం



**గాంధారి, జూన్6 మహాప్రభ**
గాంధారి మండల విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ముఖ్య అతిథులుగా విచ్చేసిన అనంతరం విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు వడ్ల భీమయ్య, వెంకటేశం,రామచందర్, మాట్లాడుతూ.. విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులందరూ ఐక్యంగా ఉండి మన హక్కులను కాపాడుకోవాలనికోరారు. విశ్వబ్రాహ్మణ సంఘం నూతన అధ్యక్షునిగా కమ్మరి సురేష్, ఉపాధ్యక్షులుగా వడ్ల నారాయణ, వడ్ల వెంకటేశం, వడ్ల రమేష్, వడ్ల ప్రభాకర్, ప్రధాన కార్యదర్శిగా ఆవుసుల శ్రీకాంత్, కార్యదర్శులుగా కమ్మరి సాయిలు, వడ్ల చిన్న విట్టల్, వడ్ల హన్మాండ్లు, కోశాధికారిగా వడ్ల చందు, ఎన్నుకున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు చంద్రశేఖర్ చారి, రాజు చారి, బ్రహ్మం చారి, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# అప్పటికల్లా విశ్వగురుగా భారత్...

**- చైనాను వెనక్కి నెట్టి అమెరికాతో పోటీ పడుతూ...**

**-నంబర్ 1 స్థానానికి భారత్**

త్వరలో ప్రపంచ ఆర్థిక శక్తిగా అవతరించనుంది. ప్యారిస్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ కు చెందిన వరల్డ్ ఇనీక్వాలిటీ ల్యాబ్ ఇటీవల విడుదల చేసిన తాజా నివేదిక ప్రకారం, గ్లోబల్ జస్టిస్ రిపోర్ట్ ఏ ప్లాన్ ఫర్ ఈక్వాలిటీ అండ్ ప్రాస్పెరిటీ విత్ ప్లానెటరీ బౌండరీస్ అనే పేరుతో ఒక అధ్యయనం వెలువడింది. ఈ నివేదిక ప్రకారం 2060 నాటికి కొనుగోలు శక్తి ఆధారంగా గ్లోబల్ జీడీపీ వాటాలో చైనాను భారత్ అధిగమిస్తుందని పరిశోధకులు అంచనా వేశారు.

21వ శతాబ్దం ద్వితీయార్ధంలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో బీజింగ్ వాటా క్రమంగా క్షీణిస్తుందని వారు తమ నివేదికలో స్పష్టంగా పేర్కొన్నారు. ఈ మార్పులు భవిష్యత్తులో ప్రపంచ దేశాల ముఖచిత్రాన్ని మార్చే విధంగా ఉండబోతున్నాయని ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు.

**చైనా జనాభా, ఆర్థిక పరిస్థితి**

ప్రస్తుతం ప్రపంచ జీడీపీలో చైనా వాటా కొనుగోలు శక్తి పరంగా దాదాపు 20 శాతంగా ఉంది. ఇది అమెరికా కంటే మూడింట ఒక వంతు. 2035 నాటికి చైనా ఆర్థిక వ్యవస్థ అమెరికా కంటే 2 రెట్లు పెద్దగా ఉంటుందని అంచనాలు ఉన్నాయి. కానీ చైనా జనాభా వాటా చాలా వేగంగా పడిపోతోంది. 1945లో



ప్రపంచ జనాభాలో 23 శాతంగా ఉన్న చైనా జనాభా 2025 నాటికి 17 శాతానికి పడిపోతుంది. అలాగే 2100 నాటికి అది 8 శాతం కంటే తక్కువకు చేరుకుంటుంది. దీని ఫలితంగా 21వ శతాబ్దం ద్వితీయార్థంలో ప్రపంచ జీడీపీలో చైనా వాటా స్థిరపడి క్రమంగా క్షీణించడం ప్రారంభమవుతుంది. ఈ పరిణామాల కారణంగా సరిగ్గా 2060 నాటికి చైనాను భారతదేశం అధిగమిస్తుందని నివేదిక తెలియజేసింది.ప్రపంచ అసమానతలు గతంలో కొన్ని దేశాలు ప్రపంచాన్ని శాసించాయి. 1950 ప్రాంతంలో అమెరికా ప్రపంచ జీడీపీలో 35 నుంచి 40 శాతం వాటాతో, అలాగే 1900-1910 మధ్య కాలంలో ఐరోపా 40 నుంచి 45 శాతం వాటాతో పూర్తి ఆధిపత్యం చెలాయించాయి. కానీ చైనాకు భవిష్యత్తులో అలాంటి ఆధిపత్య స్థితి వచ్చే అవకాశం చాలా తక్కువ అని పరిశోధకులు స్పష్టం చేశారు. 19, 20వ శతాబ్దాల మాదిరిగా కాకుండా 21వ శతాబ్దంలో ప్రపంచం బహుళ ధృవంగా మారుతుందని నివేదిక వెల్లడించింది. మరోవైపు చైనాతో పోలిస్తే భారత్‌లో అసమానతలు చాలా ఎక్కువగా ఉన్నాయని, కానీ ఉత్పాదకత వృద్ధి మాత్రం తక్కువగా ఉందని నివేదిక పేర్కొంది. చైనాలో మానవ వనరుల కోసం ఖర్చు చేయడం వల్లే అక్కడ ఉత్పాదకత మెరుగ్గా ఉందని విశ్లేషకులు అభిప్రాయపడ్డారు.


**తాజా జీడీపీ అంచనాలు**

కొనుగోలు శక్తి అనేది ఒక దేశం కరెన్సీకి మరో దేశంలో ఎంత మేర వస్తువులు, సేవలు కొనుగోలు చేయవచ్చో కొలిచే ప్రమాణం. అంతర్జాతీయ ద్రవ్య నిధి విడుదల చేసిన తాజా వరల్డ్ ఎకనామిక్ ఔట్లుక్ ప్రకారం 2026 నాటికి భారత్ స్థూల దేశీయోత్పత్తి విలువ 4.15 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటుంది. ఇది 2025 లో ఉన్న 3.92 ట్రిలియన్ డాలర్ల కంటే ఎక్కువ. అదే సమయంలో బ్రిటన్ జీడీపీ 2025లో 4 ట్రిలియన్ డాలర్ల నుంచి 2026లో 4.27 ట్రిలియన్ డాలర్లకు పెరుగుతుంది. అయితే జపాన్ జీడీపీ మాత్రం 2025లో ఉన్న 4.48 ట్రిలియన్ డాలర్ల నుంచి 2026 నాటికి 4.38 ట్రిలియన్ డాలర్లకు పడిపోతుందని అంచనా. ఇక 2026లో అమెరికా జీడీపీ అత్యధికంగా 32.38 ట్రిలియన్ డాలర్లుగా ఉండగా, 2వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న చైనా జీడీపీ 20.85 ట్రిలియన్ డాలర్లుగా నమోదు కానుందని నివేదిక వివరించింది.

## బిజినెస్

# అబ్బబ్బా.. ఒక్కసారిగా బంగారం ధరలు ధమాల్..

బంగారం కొనుగోలు చేసేవారికి భారీ ఊరట దక్కింది. గోల్డ్ రేట్లు భారీగా తగ్గుముఖం పట్టాయి. గత కొద్దికాలంగా ధరలు పడిపోతూ వస్తోన్నాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ బలపడటం, ఇరాన్-అమెరికా మధ్య ఉద్రిక్తతలు తగ్గడం, ముడి చమురు ధరలు అదుపులోకి వస్తున్న క్రమంలో గోల్డ్ రేట్లపై వీటి ప్రభావం పడుతుంది. అంతర్జాతీయ



పరిస్థితులను బట్టి బంగారం ధరల్లో మార్పులు చోటుచేసుకుంటాయి. ప్రస్తుతం ప్రపంచస్థాయిలో యుద్ధాలు, ఉద్రిక్తతలు తగ్గి సానుకూల వాతావరణం ఉండటంతో గోల్డ్ రేట్లు డౌన్ అవుతున్నాయి. శనివారం మరోసారి గోల్డ్ రేట్లు తగ్గాయి. అనంతరం దేశంలోని ప్రధాన నగరాల్లో ధరలు ఎలా ఉన్నాయనేది ఒకసారి చూద్దాం.

**గోల్డ్ రేట్లు ఇలా..**

-దేశీయ బులియన్ మార్కెట్లో 10 గ్రాముల 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం ధర రూ.1,52,730 వద్ద కొనసాగుతోండగా.. నిన్నటితో పోలిస్తే ఇవాళ ఒక్కారోజే ఏకంగా రూ.3 వేలు తగ్గింది. ఇక 22 క్యారెట్ల రేటు రూ.1.40 లక్షలుగా ఉంది. ఇవాళ ఒక్కరోజే రూ.2,750 తగ్గింది.

-హైదరాబాద్‌లో 24 క్యారెట్ల గోల్డ్ రేటు రూ.1,52,730 వద్ద కొనసాగుతోండగా.. 22 క్యారెట్ల ధర రూ.1.40 లక్షల వద్ద ఉంది

చెన్నైలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,54,910 వద్ద ఉండగా.. ఒక్కరోజే రూ.3050 తగ్గింది. ఇక 22 క్యారెట్ల రేటు రూ.1.42 లక్షలుగా ఉంది. శనివారం రూ.2300 పడిపోయింది

-బెంగళూరులో 24 క్యారెట్ల గోల్డ్ రేటు రూ.1,52,730గా ఉండగా.. 22 క్యారెట్ల ధర రూ.1.40 లక్షల వద్ద ట్రేడవుతోంది.

ఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,55,910 వద్ద ఉండగా.. 22 క్యారెట్ల రేటు రూ.1,40,150 వద్ద ఉంది.

**వెండి ధరలు ఎలా ఉన్నాయంటే..?**

-దేశ రాజధాని ఢిల్లీలో కేజీ సిల్వర్ ధర రూ.2.65 లక్షల వద్ద ప్రస్తుతం ఉంది. శుక్రవారం రూ.2.75 లక్షల వద్ద స్థిరపడింది

-హైదరాబాద్‌లో కేజీ వెండి ధర రూ.2.70 లక్షల వద్ద ఉంది. నిన్న రూ.2.80 లక్షలుగా ఉంది. ఇవాళ రూ.10 వేలు తగ్గింది

-చెన్నైలో కేజీ వెండి ధర రూ.2.70 లక్షల వద్ద ఉంది. శుక్రవారం రూ.2.80 లక్షల వద్ద కొనసాగుతోంది

# ఐదు ఐపీవోలకు గ్రీన్‌సిగ్నల్

న్యూఢిల్లీ,

దేశీయ స్టాక్ మార్కెట్లోకి మరో ఐదు సంస్థలు అడుగుపెట్టడానికి సిద్ధమవుతున్నాయి. ఓయో అనుబంధ సంస్థయైన ప్రిస్మ్, వార్‌బర్గ్ పింకస్‌కు చెందిన తృహోమ్ ఫైనాన్స్, రియల్ ఎస్టేట్ డెవలపర్ వీగాలాండ్ డెవలపర్స్‌తోపాటు మరో రెండు సంస్థల ఐపీవోకి సెబీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. మిగతా రెండు సంస్థల్లో అగ్రికల్చరల్ సొల్యూషన్స్ కంపెనీ అద్వాంటా ఎంటర్‌ప్రైజెస్, మెహతా హైటెక్ ఇండస్ట్రీస్ ఉన్నట్టు సెబీ పేర్కొంది. ఈ నెల 1 నుంచి ఐదు లోపల ఆయా సంస్థలు దాఖలు చేసిన దరఖాస్తులపై కులంకుషకంగా చర్చించిన తర్వాత అనుమతినిచ్చినట్టు సెబీ వర్గాలు వెల్లడించాయి. ఈ ఏడాది జనవరి నుంచి మార్చి వరకు దరఖాస్తు చేసుకున్న ఐదు కంపెనీలు మొత్తంగా రూ.10 వేల కోట్ల వరకు నిధులు సమీకరించనున్నాయి. వీటిలో ఓయోకు చెందిన ప్రిస్మ్ అత్యధికంగా రూ.6,650 కోట్ల వరకు నిధులు సమీకరించనుండగా, తృహోమ్ ఫైనాన్స్ రూ.1,500 కోట్లు, వేగాల్యాండ్ డెవలపర్స్ రూ.250 కోట్లు నిధులు సేకరించనున్నాయి.

**సీఎమ్మార్ గ్రీన్‌టెక్‌కు అపూర్వ స్పందన**

సీఎమ్మార్ గ్రీన్ టెక్నాలజీస్ లిమిటెడ్ ఐపీవోకి పెట్టుబడిదారుల నుంచి విశేష స్పందన లభించింది. సంస్థ జారీ చేసిన షేర్ల కంటే 127 రెట్ల అధిక బిడ్డింగ్‌లు దాఖలయ్యాయి. క్యాలిఫైడ్ ఇనిస్టిట్యూషనల్ బయ్యర్లు, నాన్-ఇనిస్టిట్యూషనల్ ఇన్వెస్టర్లు అత్యధికంగా కొనుగోళ్లు జరిపారు. రూ.631 కోట్ల నిధుల సేకరణకు సంబంధించి 2,30,43,930 షేర్లను జారీ చేయగా..2,92,75,44,594 షేర్ల బిడ్డింగ్‌లు వచ్చాయి.

## స్పోర్ట్స్

# టీమిండియా టీ20 కెప్టెన్‌గా శ్రేయాస్ అయ్యర్..

**-ఐర్లాండ్, ఇంగ్లండ్ టూర్లకు వైభవ్ సూర్యవంశీ ఎంపిక**

**న్యూఢిల్లీ :**

భారత క్రికెట్ జట్టు టీ20 కెప్టెన్‌గా శ్రేయాస్ అయ్యర్ పేరును ప్రకటించారు. ఐర్లాండ్, ఇంగ్లండ్‌తో ఆడే భారత ప్లేయర్ల జాబితాను ఇవాళ బీసీసీఐ సెలెక్షన్ కమిటీ రిలీజ్ చేసింది. అయితే యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి టీ20 జట్టులో చోటు కల్పించారు. ఇండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌ను తప్పించి ఆ బాధ్యతలను శ్రేయాస్ అయ్యర్‌కు అప్పగించారు. ఐర్లాండ్ పర్యటనలో భాగంగా ఇండియా రెండు టీ20లు ఆడనున్నది. జూన్ 26, 28వ తేదీల్లో ఆ మ్యాచ్‌లు డబ్లిన్‌లో జరగనున్నాయి. ఇక జూలై ఒకటో తేదీ నుంచి 11 తేదీ వరకు ఇంగ్లండ్‌తో అయిదు టీ20 మ్యాచ్‌లు జరగనున్నాయి. లాస్ ఏంజిల్స్‌లో జరగబోయే ఒలింపిక్స్‌తో పాటు 2028లో జరగబోయే టీ20 వరల్డ్‌కప్‌ను దృష్టిలో పెట్టుకుని ప్లేయర్లను ప్రకటించారు. రెండు దేశాలతో జరిగే టీ20 సిరీస్ కోసం తిలక్ వర్మను వైస్ కెప్టెన్‌గా ప్రకటించారు. ఇటీవల ముగిసిన 2026 ఐపీఎల్‌లో తన బ్యాటింగ్‌తో దుమ్మురేపిన వైభవ్ సూర్యవంశీకి భారత బృందంలో చోటు దక్కింది. టెండూల్కర్ తర్వాత అతి పిన్న వయసులో సీనియర్ జట్టుకు ఎంపికైన యువ బ్యాటర్‌గా వైభవ్ రికార్డు క్రియేట్



చేశాడు. టోర్నీలో అత్యధికంగా 776 రన్స్ చేసి ఆరెంజ్ క్యాప్ గెలిచిన విషయం తెలిసిందే. వైభవ్ తన బ్యాటింగ్‌తో భారీ స్కోర్లు చేస్తున్న నేపథ్యంలో అతన్ని టీ20 జట్టులోకి తీసుకున్నారు. ఐపీఎల్‌లో రాణించిన నితీశ్ కుమార్ రెడ్డి, హర్షిత్ రాణా, ప్రిన్స్ యాదవ్‌లు కూడా భారత బృందంలో ఉన్నారు. ఇక సీనియర్ ఆటగాళ్లు సంజూ శాంసన్, ఇషాన్ కిషన్, అక్షర్ పటేల్, సిరాజ్, హర్షదీప్ సింగ్ కూడా భారత బృందంలో ఉన్నారు. టీ20లకు హార్దిక్ పాండ్యాను ఎంపిక చేయలేదు. ఐపీఎల్‌లో గేమ్ ప్లాన్‌తో దుమ్మురేపిన ఆర్సీబీ కెప్టెన్ రజత్ పటిదార్‌ను కూడా సెలెక్షన్ కమిటీ పక్కన పెట్టేసింది. ఇక స్టార్ బౌలర్ బుమ్రాకు రెస్టు ఇచ్చింది. ఇంగ్లండ్, ఐర్లాండ్ టూర్లకు బుమ్రాను ఎంపిక చేయలేదు. ఆ తర్వాత ఏషియన్ గేమ్స్ కోసం అతన్ని ఎంపిక చేసింది. ఇక గాయపడ్డ కోహ్లీ స్థానంలో వన్డేల కోసం జైస్వాల్‌ను తీసుకున్నట్లు చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ తెలిపాడు. ఆఫ్ఘనిస్థాన్‌తో జరిగే వన్డే సిరీస్‌కు కోహ్లీ స్థానంలో జైస్వాల్ ఆడనున్నాడు. అయితే ఇంగ్లండ్ సిరీస్ వరకు కోహ్లీ కోలుకునే అవకాశాలు ఉన్నట్లు అగార్కర్ చెప్పారు. టీ20 వరల్డ్‌కప్‌ను అందించిన సూర్యకుమార్ యాదవ్‌ను కెప్టెన్సీ నుంచి తప్పించడమే కాదు, కనీసం అతన్ని జట్టులోకి కూడా తీసుకోకపోవడం గమనార్హం.

**ఐర్లాండ్, ఇంగ్లండ్ సిరీస్‌లకు భారత జట్టు ఇదే..**

శ్రేయాస్ అయ్యర్(కెప్టెన్), అభిషేక్ శర్మ, సంజూ శాంసన్, ఇషాన్ కిషన్, శివం దూబే, తిలక్ వర్మ(వీసీ), నితీశ్ రెడ్డి, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్, సిరాజ్, హర్షిత్ రాణా, అర్షదీప్ సింగ్, ప్రిన్స్ యాదవ్, వైభవ్ సూర్యవంశీ

# సచిన్ రికార్డు బ్రేక్ చేసిన వైభవ్

ఐపీఎల్ 2026లో రికార్డుల మోత మోగించిన 15 ఏళ్ల యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి జాతీయ జట్టు నుంచి తొలిసారి పిలుపు వచ్చింది. ఐర్లాండ్, ఇంగ్లాండ్ టీ20 సిరీస్‌ల కోసం ప్రకటించిన భారత జట్టులో అతడికి చోటు దక్కింది. 15 ఏళ్ల 70 రోజుల వయసులోనే ఎంపికై సచిన్ టెండూల్కర్ రికార్డును వైభవ్ బ్రేక్ చేశాడు. ఐపీఎల్‌లో 776 పరుగులు, 72 సిక్సర్లతో ఆరెంజ్ క్యాప్, మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్ అవార్డులను గెలుచుకుని, సెలక్టర్లు కచ్చితంగా ఎంపిక చేయాల్సిన పరిస్థితిని అతడు కల్పించాడు.15 ఏళ్ల వయసులోనే ఐపీఎల్‌లో రికార్డుల బూజు దులిపిన వైభవ్ సూర్యవంశీకి జాతీయ జట్టు నుంచి పిలుపు అందింది. ఐర్లాండ్, ఇంగ్లాండ్‌తో త్వరలో జరగనున్న టీ20 సిరీస్ కోసం భారత సెలక్షన్ కమిటీ శనివారం జట్లను ప్రకటించింది. ఇందులో వైభవ్ సూర్యవంశీకి చోటు దక్కింది. తన ప్రదర్శనతో జట్టులో ఎంపిక చేయక తప్పని పరిస్థితిని వైభవ్ కలిగించాడని చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ వెల్లడించాడు. అయితే భారత



జట్టు నుంచి తొలిసారి పిలుపు అందుకోవడం ద్వారా.. వైభవ్ సూర్యవంశీ రికార్డు క్రియేట్ చేశాడు.15 ఏళ్ల 70 రోజుల వయసులో వైభవ్‌కు టీమిండియా నుంచి పిలుపు అందింది. గతంలో ఈ రికార్డు టీమిండియా క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ పేరిట ఉంది. మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్.. భారత్ తరఫున 16 ఏళ్ల 205 రోజులు ఉన్నప్పుడు ఎంపికయ్యాడు. తాజాగా ఆ రికార్డును వైభవ్ సూర్యవంశీ బ్రేక్ చేశాడు. ప్రపంచ దృష్టిని తనవైపు ఆకర్షించాడు. కాగా ఇటీవల ముగిసిన ఐపీఎల్ 2026లో వైభవ్ సూర్యవంశీ పలు భారీ రికార్డులు బ్రేక్ చేశాడు. తన పవర్ బ్యాటింగ్‌తో సత్తాచాటిన అతడు.. భారీ సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. ఈ సీజన్‌లో అతడు ఏకంగా 72 సిక్సర్లు బాదాడు. దీంతో ఓ ఐపీఎల్ సీజన్‌లో అత్యధిక సిక్సర్లు కొట్టిన గేల్ రికార్డును బ్రేక్ చేశాడు. యూనివర్సల్ బాస్ క్రిస్ గేల్.. 2012 సీజన్‌లో 65 సిక్సర్లు బాదడం గమనార్హం. మరోవైపు ఇండియన్ ప్రీమియర్ లీగ్ 19వ ఎడిషన్‌లో ఈ 15 ఏళ్ల చిచ్చర పిడుగు 16 మ్యాచులలో ఆడాడు. అందులో ఏకంగా సుమారు 240 స్ట్రైక్ రేటుతో 776 పరుగులు స్కోరు చేశాడు. దీంతో ఆరెంజ్ క్యాప్ సొంతం చేసుకున్నాడు. అంతేకాకుండా 436.5 పాయింట్స్‌తో మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్ ఆఫ్ ది సీజన్ అవార్డు సొంతం చేసుకున్నాడు. 72 సిక్సర్లతో సూపర్ సిక్సెస్ ఆఫ్ ది సీజన్‌గా నిలిచాడు. 237.31 స్ట్రయిక్ రేట్‌తో సూపర్ స్ట్రయికర్ ఆఫ్ ది సీజన్‌గా నిలిచాడు. ఎమర్జింగ్ ప్లేయర్ ఆఫ్ ది సీజన్ అవార్డు కూడా వైభవ్ సూర్యవంశీకే దక్కడం గమనార్హం.

# ఆఫ్ఘనిస్థాన్‌తో వన్డే సిరీస్..

**-కోహ్లీ స్థానంలో జట్టులోకి యశస్వి జైస్వాల్**



ఆఫ్ఘనిస్థాన్ తో జరగబోయే మూడు వన్డేల సిరీస్ కోసం భారత జట్టులోకి యువ ఓపెనర్ యశస్వీ జైస్వాల్ ను సెలెక్టర్లు ఎంపిక చేశారు. గాయపడిన స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ స్థానంలో అతడిని జట్టులోకి తీసుకుంటున్నట్లు చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ ప్రకటించారు. జైస్వాల్ తన చివరి వన్డేలో సౌతాఫ్రికాపై అజేయ సెంచరీ (116 పరుగులు, నాటౌట్) తో అదరగొట్టడం విశేషం. ఇదే సిరీస్‌లో సీనియర్ ఆటగాళ్లు రోహిత్ శర్మ , హార్దిక్ పాండ్యా ఆడటం వారి ఫిట్‌నెస్ క్లియరెన్స్‌పై ఆధారపడి ఉంటుందని సెలెక్టర్లు స్పష్టంచేశారు.వెన్నునొప్పితో బాధపడుతున్న ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా ఇప్పటికే బెంగళూరులోని బీసీసీఐ 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'లో రిహాబిలిటేషన్‌లో ఉండగా.. తొడ కండరాల గాయంతో బాధపడుతున్న రోహిత్ కూడా త్వరలో అక్కడికి చేరుకుని ఫిట్‌నెస్ పరీక్షకు హాజరుకానున్నాడు. ఇటీవల అహ్మదాబాద్‌లో జరిగిన ఐపీఎల్ 2026 ఫైనల్ మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరఫున ఆడుతున్నప్పుడు కోహ్లీకి తొడ కండరానికి గాయమైంది. ఆ మ్యాచ్‌లో 75 పరుగులతో జట్టును గెలిపించినప్పటికీ ఆ తర్వాత గాయం తీవ్రత ఎక్కువవడంతో అతడు ఈ సిరీస్‌కు దూరమవాల్సి వచ్చింది. జూలైలో జరిగే ఇంగ్లండ్ వన్డే సిరీస్ నాటికి కోలుకునే అవకాశం ఉందని అగార్కర్ చెప్పారు. భారత్, ఆఫ్ఘనిస్థాన్ మధ్య వన్డే పోరు జూన్ 13న ధర్మశాల వేదికగా ప్రారంభం కానుంది. ఆ తర్వాత మిగిలిన రెండు వన్డే మ్యాచ్‌లు జూన్ 17న లక్నోలో, జూన్ 20న చెన్నైలో నిర్వహించనున్నారు. ఈ సిరీస్ ముగిసిన తర్వాతే ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లే పూర్తిస్థాయి భారత వన్డే జట్టును సెలెక్టర్లు ప్రకటించనున్నారు. రోహిత్, హార్దిక్‌లు ఫిట్‌నెస్ సాధిస్తేనే ఈ సిరీస్‌లో ఆడతారని, లేదంటే జట్టులో మరికొన్ని మార్పులు ఉండే అవకాశం ఉందని బీసీసీఐ వర్గాలు చెబుతున్నాయి.




# అందాలతో కంచె వేస్తున్న ప్రగ్యా

# నార్త్ అమెరికాలో 'పెద్ది' దూకుడు..

## -2.2 మిలియన్ డాలర్ల మార్క్ దాటేసిన రామ్ చరణ్ సినిమా!

మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా నటించిన భారీ పాన్ ఇండియా చిత్రం 'పెద్ది' బాక్సాఫీస్ వద్ద విజయవంతంగా దూసుకుపోతోంది. దర్శకుడు బుచ్చిబాబు సన తెరకెక్కించిన ఈ ప్రతిష్టాత్మక చిత్రం విడుదలైన తొలి రోజు నుంచే ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ పొందుతోంది. దేశీయ మార్కెట్‌తో పాటు ఓవర్సీస్‌లోనూ ఈ సినిమా అద్భుతమైన వసూళ్లను నమోదు చేస్తూ రామ్ చరణ్ కెరీర్‌లో మరో మైలురాయిగా నిలుస్తోంది. భారీ అంచనాల నడుమ విడుదలైన 'పెద్ది'కి ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ ఓపెనింగ్స్ లభించాయి. ముఖ్యంగా ప్రీమియర్ షోలు, అడ్వాన్స్ బుకింగ్స్ విషయంలో ఈ సినిమా సరికొత్త రికార్డులు సృష్టించింది. విడుదలకు ముందే ఓవర్సీస్ మార్కెట్‌లో భారీ హైప్ క్రియేట్ చేసిన ఈ చిత్రం, విడుదల తర్వాత కూడా అదే జోరును కొనసాగిస్తోంది.ఓవర్సీస్ మార్కెట్‌లో, ముఖ్యంగా నార్త్ అమెరికా ప్రాంతంలో తెలుగు సినిమాలకు ప్రత్యేక ఆదరణ ఉంటుంది. ఈ నేపథ్యంలో 'పెద్ది' అక్కడ భారీ స్థాయిలో విడుదలైంది. విడుదలైన కొద్ది రోజుల్లోనే ఈ సినిమా నార్త్ అమెరికా బాక్సాఫీస్ వద్ద 2.2 మిలియన్ డాలర్ల వసూళ్ల మార్క్‌ను అధిగమించినట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ఈ కలెక్షన్లతో 'పెద్ది' రామ్ చరణ్ సోలో హీరోగా నటించిన చిత్రాల్లో అత్యుత్తమ ఓపెనింగ్ సాధించిన సినిమాల్లో ఒకటిగా నిలిచిందని సినీ విశ్లేషకులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం సినిమా జోరు చూస్తుంటే త్వరలోనే 2.5 మిలియన్ డాలర్ల మార్క్‌ను కూడా సులభంగా చేరుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.సినిమాకు ప్రేక్షకుల నుంచి వస్తున్న స్పందన, వీకెండ్‌లో నమోదవుతున్న ఆక్యుపెన్సీని బట్టి చూస్తే 'పెద్ది'కి లాంగ్ రన్ కూడా బలంగా ఉండే అవకాశం ఉందని ట్రేడ్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా కుటుంబ ప్రేక్షకులు, యువత నుంచి మంచి స్పందన లభిస్తుండటంతో వసూళ్లు మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని భావిస్తున్నారు. సినిమాలో రామ్ చరణ్ నటన, భావోద్వేగ సన్నివేశాలు, స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్ కథనం ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. క్లైమాక్స్‌లో చరణ్ ప్రదర్శించిన నటనపై సోషల్ మీడియాలో ప్రశంసల వర్షం కురుస్తోంది. ఇక 'పెద్ది' చిత్రంలో రామ్ చరణ్ సరసన జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటించారు. అచ్చియమ్మ పాత్రలో ఆమె నటన ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. భారీ బడ్జెట్‌తో రూపొందిన ఈ చిత్రాన్ని వృద్ధి సినిమాస్ నిర్మించింది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా విజయవంతంగా ప్రదర్శితమవుతున్న 'పెద్ది' రాబోయే రోజుల్లో మరిన్ని బాక్సాఫీస్ రికార్డులు సృష్టించే అవకాశాలు కనిపిస్తున్నాయి.




# కాక్‌టెయిల్-2 లో నటించడానికి భయపడ్డా: రష్మిక



కొద్ది రోజుల్లో 'కాక్‌టెయిల్ 2'తో ప్రేక్షకుల్ని అలరించడానికి ముస్తాబవుతోంది అందాల తార రష్మిక. ఆమె, షాహిద్ కపూర్, కృతి సనన్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రమిది. ఇటీవలే విడుదలైన ట్రైలర్‌కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చింది. ఇందులో దియా పాత్రలో కనిపించనుంది రష్మిక. ఈ నేపథ్యంలోనే ఓ కార్యక్రమంలో పాల్గొన్న రష్మిక.. ఈ సినిమా గురించి మాట్లాడుతూ.. 'ఈ ప్రాజెక్టులో నటించడం గురించి నేను అంత సులభంగా నిర్ణయం తీసుకోలేదు. ముఖ్యంగా ఇందులో నటించడానికి నిజంగా భయపడ్డాను. ఎందుకంటే ఇప్పటి వరకు నేను భాగమైన చిత్రాల్లో ఇంత మోడ్రన్‌గా కనిపించలేదు. అందుకే ప్రారంభంలో ఈ చిత్రంలో నటించడం గురించి నేను తీసుకున్న నిర్ణయం సరైందా? కాదా? అనే సందేహం ఉండేది. కానీ అదే సమయంలో ఇంతకు ముందెప్పుడూ ఇలాంటి పాత్రలో చేయలేదు కాబట్టి.. ఇందులో నటించాను' అని చెప్పింది.

# విమర్శలు కూడా సృజనాత్మకతగానే చూడాలి


## నటి అనసూయా భరద్వాజ్



సినిమా అంటేనే కేవలం కల్పిత కథ అని.. అందులోని తప్పొప్పులు నిర్ణయించుకునే పూర్తి విచక్షణ మనపైనే ఉంటుందని నటి అనసూయ భరద్వాజ్ అన్నారు. సమాజంలో జరిగే విషయాలకు సినిమాలతో ముడిపెట్టొద్దని అన్నారు. చిత్రరంగంపై బాధ్యత, సృజనాత్మక స్వేచ్ఛ గురించి ఆమె సుదీర్ఘ పోస్ట్ పెట్టారు. 'ఒకప్పటి కథలలో నైతికత కనిపించేది. హీరో పాత్రలు స్ఫూర్తిదాయకంగా ఉండేవి. విలన్ పాత్రలు మనం అనుకరించకూడదు అనిపించేలా ఉండేవి. ఈ రోజుల్లో తెరకెక్కే కథల్లో ఈ స్పష్టత లోపిస్తోంది. పాత్రను గొప్పగా చూపించడం కోసం దర్శకులు ఈ గందరగోళాన్ని సృష్టిస్తున్నారు. ఒక కథను తెరకెక్కిస్తున్నామంటే.. దాని ప్రభావం ఎలా ఉంటుందనే దానిలో టెక్నికల్ టీమ్ నుంచి దర్శక నిర్మాతలు, నటీనటులు, చివరకు ప్రేక్షకులు కూడా కీలక పాత్రధారులే. అందుకే సినిమా ఎప్పుడూ బాధ్యతాయుతంగా ఉండాలి. సృజనాత్మకత విషయంలో వచ్చిన భేదాభిప్రాయాల వల్ల నేను కొన్ని షోల నుంచి వైదొలిగిన సందర్భాలూ ఉన్నాయి. దానివల్ల నా ప్రతిభకు తగిన అవకాశాలు రావడంలో ఇబ్బందులూ ఎదుర్కొన్నా. అంత కష్టంలోనూ నా సిద్ధాంతాల కోసమే నిలబడ్డాను అని అనసూయ చెప్పారు. సృజనాత్మక స్వేచ్ఛ అనేది చాలా అవసరం. అదే సమయంలో సామాజిక స్పృహ ఉండటం కూడా అంతే ముఖ్యం. సినిమాలు సమాజాన్ని మంచి మార్గంలో ముందుకు నడిపించాలని ఆశించకూడదు. అలాగని సమాజంపై ఎలాంటి ప్రభావం చూపవని కూడా అనుకోకూడదు. సమాజంలో జరిగే ప్రతి విషయానికి సినిమాను నిందించలేం. సోషల్ మీడియాలో చాలామంది ముందుకువచ్చి ఇలాంటి విషయాలపై చర్చలు పెట్టడం, కథల్లో పాత్రలను చూపించే విధానాలను ప్రశ్నించడం, విమర్శనాత్మకంగా ఆలోచించడాన్ని చూస్తుంటే నాకు నిజంగా సంతోషంగా ఉంది. అవసరమైనప్పుడు తప్పులను ప్రశ్నించడం అంటే సృజనాత్మకతపై దాడి చేయడం కాదు, అది సమాజంలో అవగాహన పెంచడం మాత్రమే' అని అనసూయ వివరించారు.

# హీరోగా ప్రేమ కథా చిత్రమ్ యాక్టర్..

## -హైప్ పెంచుతున్న 'మొహబ్బత్' ఫస్ట్ లుక్



మారుతి డైరెక్షన్‌లో వచ్చిన ప్రేమ కథా చిత్రమ్‌తోపాటు చిక్కిలిగింత, కాయ్ రాజా కాయ్ సినిమాల్లో క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా మెరిశాడు సంతోష్ కల్వచర్ల. ఈ యంగ్ యాక్టర్ లీడ్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం 'మొహబ్బత్'. సంతోష్ కల్వచర్ల, శ్రేయాసి సేన్ కాంబోలో యూత్‌ఫుల్ లవ్‌స్టోరీగా వస్తోన్న ఈ చిత్రాన్ని మ్యాక్ డైరెక్ట్ చేస్తున్నాడు. ఈ మూవీ పూజా కార్యక్రమాలతో గ్రాండ్‌గా లాంచైన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా రిలీజ్ చేసిన ఫస్ట్ లుక్ యూత్‌లో హైప్ క్రియేట్ చేస్తుంది. బైక్‌పై వెళ్తున్న హీరోహీరోయిన్లు సూపర్ రొమాంటిక్ లుక్‌లో కనిపిస్తూ సినిమాపై క్యూరియాసిటీ పెంచేస్తున్నారు. ఈ మూవీలో అజయ్ ఘోష్, సాత్విక్ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఏబీఎస్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై అఫ్రోజ్ షేక్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి సునీల్ కశ్యప్ సంగీతం అందిస్తున్నాడు.నిర్మాత అఫ్రోజ్ తొలి సినిమానే అయినా ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా 'మొహబ్బత్' పాన్ ఇండియాగా స్థాయిలో రిలీజ్ చేసేలా సినిమాను తెరకెక్కిస్తుండటంతో అంచనాలు పెరిగిపోతున్నాయి. అన్ని రకాల ఎలిమెంట్స్‌తో సాగే ఎమోషనల్ యూత్ ఫుల్ జెన్ జీ చిత్రంగా ఉండబోతుందని మేకర్స్ చెబుతున్నారు.

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com